'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 80 | బుధవారం | 4.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 80 | Wednesday | 4.11.2026 | Pages: 8 | Rate: 2



ముంచుకొస్తున్న యాంటీఇన్‌కంబెన్సీ ముప్పు!

5లో..

ఓవైపు సొంతింటి పోరు.. మరోవైపు ప్రతిపక్షాల దాడి

» రేవంత్ నాయకత్వానికి అసలైన పరీక్ష
» అధికార పార్టీలో పదవుల పంచాయితీలు
» బీఆర్ఎస్ విమర్శలు.. బీజేపీ అధికార వ్యూహాలు
» ఎల్‌నినోతో నీటి గండం.. పెరుగుతున్న ధరలు
» అధికారంలో కాంగ్రెస్.. అంతర్గతంగా కల్లోలం!

తెలంగాణలో అధికారం చేతిలో ఉన్నా.. కాంగ్రెస్‌కు రాజకీయంగా కష్టకాలం మొదలైందా? సొంత పార్టీ నేతలే కత్తులు దూస్తుంటే.. ప్రతిపక్షాలు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయా? పదవుల పంపకాలతో మొదలైన పంచాయితీలు ఢిల్లీ వేదికగా బాహాబాహీ వరకు చేరాయనే ప్రచారం పార్టీ పరువును బజారుకీడుస్తోంది. ఎంపీ లేఖాస్త్రం మరో కలకలం రేపుతోంది. ఈ పరిణామాలను గమనిస్తున్న బీఆర్ఎస్ కేటీఆర్, హరీశ్ రావు విమర్శలతో రేవంత్ సర్కారుపై విరుచుకుపడుతోంది. మరోవైపు తెలంగాణలో అధికారం మాదేనంటూ అమిత్ షా యుద్ధ ప్రకటన చేయడంతో బీజేపీ పోరు కొత్త మలుపు తిరిగింది. ఇంతలో ఎల్‌నినో ముప్పు.. సాగునీటిపై అనిశ్చితి.. హైదరాబాద్‌లో తాగునీటి ఆందోళనలు.. పెరుగుతున్న బియ్యం ధరలు సామాన్యుడిని కలవరపెడుతున్నాయి. మంత్రివర్గ విస్తరణకు మోక్షం లేక అశావహుల్లో అసంతృప్తి.. గ్రేటర్ ఎన్నికల ముంగిట రాజకీయ వేడి.. ఇవన్నీ రేవంత్ నాయకత్వానికి అగ్నిపరీక్షగా మారుతున్నాయి. ఒకవైపు సొంతింటిని చక్కదిద్దుకోవాలి.. మరోవైపు ప్రత్యర్థుల దూకుడును అడ్డుకోవాలి.. ఇంకోవైపు ప్రజలకు పాలనపై భరోసా కల్పించాలి. మరి ఈ మూడు ముళ్ల సంక్షోభం నుంచి కాంగ్రెస్ గట్టెక్కుతుందా? తెలంగాణ రాజకీయ చదరంగంలో రేవంత్ తదుపరి అడుగు ఏమిటి? అధికారం నిలుస్తుందా..? ఆధిపత్య పోరులో ఆవిరవుతుందా?

అర్హుల ఓట్లు తొలగిస్తే సహించం

ప్రతి ఓటుకూ లెక్క చెప్పాల్సిందే
రాహుల్ నాయకత్వం భేషన్న ఉత్తమ్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తే సహించేది లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఓటరు పేరు తొలగింపు వెనుక సరైన కారణం ఉండాలని, ఎన్నికల సంఘం ప్రతి తొలగింపునకు లెక్క చెప్పాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. (వివరాలు 2లో..)



మళ్లీ పీఠం కాంగ్రెస్‌దే!

తెలంగాణలో బీజేపీకి అధికారం కల్లే అమిత్ షావి వ్యాఖ్యలు పగటి కలలు
కేంద్రంలోనూ హస్తం ప్రభుత్వమే: పొంగులేటి

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందంటూ కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు పగటి కలలేనని కాంగ్రెస్ నాయకుడు విమర్శించారు. తెలంగాణ ప్రజలు బీజేపీని నమ్మే పరిస్థితి లేదని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నికల సంఘాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని, ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించిందని ఆరోపించారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలకు పాల్పడుతున్న పార్టీకి తెలంగాణలో ప్రజల మద్దతు లభించదని పేర్కొన్నారు. (వివరాలు 2లో..)



ఒకే ఒక్కడు..

- ప్రజల కోసమే రాజకీయాలు
- తెలంగాణలో విలక్షణ నేత

రాజకీయాల్లో విమర్శలు సహజం.. అసంతృప్తులు సాధారణం. కానీ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాటల వెనుక కనిపిస్తున్న ఆవేదనకు రాజకీయాల కంటే ప్రజా ప్రయోజనాలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ఒకవైపు మునుగోడుకు నిధులు కేటాయించడం లేదని, సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల్లో వివక్ష చూపుతున్నారని సొంత ప్రభుత్వాన్నే నిలదీస్తున్నారు. మరోవైపు మద్యం మహమ్మారికి బలవుతున్న కుటుంబాలను చూసి చలించిపోతున్నారు. బెల్ట్‌షాపులను నియంత్రించకపోతే పోలీసులపై చర్యలు తప్పవని హెచ్చరిస్తూనే, తల్లిని కోల్పోయిన చిన్నారుల చదువు బాధ్యతను స్వయంగా తీసుకుంటున్నారు. ఈ రెండు సందర్భాల్లోనూ ఆయన వ్యక్తం చేస్తున్న ఆవేదనలో ఒకే అంశం కనిపిస్తోంది.. ప్రజలకు న్యాయం జరగాలి, నియోజకవర్గం అభివృద్ధి చెందాలి, వ్యవస్థలో మార్పు రావాలి. నాయకులపై విమర్శలు చేయడం ఆయన లక్ష్యం కాదు.. ప్రజల సమస్యలను పరిష్కరించేలా పాలకులు, అధికారులు పనిచేయాలన్నదే ఆయన మాటల్లోని అంతరార్థం. పదవుల కంటే ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని ఆయన చేస్తున్న వ్యాఖ్యలు తెలంగాణ అంతటా రాజకీయాల్లో చర్చకు దారితీస్తున్నాయి



3లో..



మద్యం మహమ్మారిపై సమరభేరి!

బెల్ట్‌షాపులకు అడ్డుకట్ట వేయాల్సిందే
పోలీసులకు తేల్చి చెప్పిన రాజన్న

మద్యం మహమ్మారికి మరో కుటుంబం బలైంది. భర్త తాగుడుకు బానిసై పెడుతున్న వేధింపులు, కుటుంబంలో ఎదురవుతున్న కష్టాలను భరించలేక ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడిన హృదయవిదారక ఘటన మునుగోడు ప్రాంతంలో కలకలం రేపింది. ఈ విషాదం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని తీవ్రంగా కలచివేసింది. వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలిచారు. మరోవైపు అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

మునుగోడుకు నిధులివ్వరా?

నిధుల కేటాయింపులో వివక్ష ఎందుకు?
అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలా పోరాడాలా?
మంత్రుల తీరుపై రాజన్న బహిరంగ అసంతృప్తి

మునుగోడు నియోజకవర్గానికి జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీరును బహిరంగ వేదికపై ప్రశ్నించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేవలం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకే పరిమితమయ్యారా? లేక రాష్ట్రానికి ఇరిగేషన్ మంత్రిగా పనిచేస్తున్నారా? అని నిలదీశారు. నిధుల కేటాయింపులు, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో మునుగోడుపై వివక్ష చూపుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై కీలక ఆదేశాలు

- మహారాష్ట్రతో వేగంగా చర్చలు పూర్తవ్వాలి
- ముంపు పరిహారానికి సిద్ధమని స్పష్టీకరణ
- నిరంతర సంప్రదింపులతో ఫలితాలు: సీఎం

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఎలాంటిజాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు సంబంధించిన పూర్తి వివరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు, ఇతర కీలక అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్ర అధికారులకు అందజేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు ముందుకు సాగేందుకు అవసరమైన సమాచారం, సాంకేతిక వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.



2లో..

కేంద్ర నిధులన్నీ రాబట్టుకోవాలి

- వినియోగంలో నిర్లక్ష్యం వద్దనే వద్దు
- శాఖలకు డిప్యూటీ సీఎం దిశానిర్దేశం



2లో..

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను పూర్తిస్థాయిలో సాధించి, సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో మరింత వేగం పెంచాలని, వాటి ద్వారా ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందించాలని స్పష్టం చేశారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్ బిల్లులు, ఇప్పటివరకు చేసిన ఖర్చులు, పథకాల పురోగతిని శాఖలవారీగా సమీక్షించారు.



డిస్మిస్ అయిన వారికి రీ-ఎంట్రీ

సింగరేణి ఉద్యోగులకు మరో అవకాశం!
దరఖాస్తులకు నవంబర్ 14 చివరి గడువు

సింగరేణిలో విధులకు గైర్హాజరైన కారణంగా ఉద్యోగాల నుంచి తొలగించబడిన మాజీ కార్మికులకు యాజమాన్యం మరో అవకాశం కల్పించింది. 2023 జనవరి 1 నుంచి 2025 డిసెంబర్ 31 మధ్య గైర్హాజరు కారణంగా డిస్మిస్ అయిన వారి కేసులను పునఃపరిశీలించాలని నిర్ణయించింది. (వివరాలు 2లో..)



7లో..

మిడ్ టర్మ్ ఎలక్షన్స్.. ట్రంప్‌కి ఎండ్ కార్డ్

- రిపబ్లికన్లపై డెమొక్రాట్ల ఒబామా వైల్డ్ కార్డ్
- ట్రంప్ భవితవ్యాన్ని తేల్చనున్న అమెరికన్లు!
- ఎన్నికల్లో కోట్లు కుమ్మరిస్తున్న కుబేరుడు మస్క్
- అధ్యక్షుడు అర్ధంతరంగా వైదొలగాల్సి వస్తోందా?

వైట్‌హౌస్‌లో ట్రంప్ థీమా.. అమెరికా వీధుల్లో అసంతృప్తి! చేతిలో అధికారం ఉన్నా.. ప్రజల మనసుల్లో స్థానం ఉందా? రెండోసారి అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన డొనాల్డ్ ట్రంప్‌కు రెండేళ్లకే రాజకీయ గండం పొంచి ఉందా? అమెరికా మధ్యంతర ఎన్నికలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్నాయి. 435 ప్రతినిధుల సభ స్థానాలు, 35 సెనేట్ స్థానాల కోసం జరుగుతున్న పోరు ట్రంప్ పాలనకు ప్రజలు ఇస్తున్న రెఫరెండంగా మారింది. పెరిగిన ధరలు, చమురు ధరల భారం, ఇరాన్‌తో యుద్ధం.. రిపబ్లికన్ల విజయావకాశాలను దెబ్బతీస్తున్నాయా? మరోవైపు ట్రంప్ పార్టీ కోసం ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ వందల కోట్ల రూపాయలు కుమ్మరిస్తుండగా, డెమొక్రాట్లకు ఊపిరిపోసేందుకు మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా రంగంలోకి దిగారు. ఓటర్లు తమవైపు మొగ్గకపోతే అధికారానికి అడ్డుకట్ట తప్పదని ట్రంప్‌కు తెలుసు. అందుకే డెమొక్రాట్లు గెలిచినా వారి బిల్లులను వీటో చేస్తానంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రజల తీర్పు ట్రంప్‌కు ఎదురుదెబ్బ ఇస్తుందా? కాంగ్రెస్‌పై పట్టు కోల్పోతే మిగిలిన రెండేళ్ల పాలన పోరాటాలమయమవుతుందా? అమెరికా రాజకీయాల్లో రాబోయే పెను మార్పుల వెనుక అసలు కథేంటి?

పచ్చదనానికి పెద్దపీట..

శాసన మండలి ప్రాంగణానికి కొత్త రూపు
మాస్టర్ ప్లాన్ రెడీ , అభివృద్ధి పనులపై సీఎస్ పరిశీలన

రాష్ట్ర శాసన మండలి ప్రాంగణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం శాసన మండలి ప్రాంగణాన్ని సందర్శించి ప్రతిపాదిత అభివృద్ధి, సుందరీకరణ పనులను పరిశీలించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. శాసనసభ స్పీకర్, శాసన మండలి చైర్మన్, వైస్ చైర్మన్, డిప్యూటీ స్పీకర్‌తో పాటు శాసనసభ, మండలి కార్యదర్శుల నివాస భవనాల నిర్మాణ ప్రతిపాదనలపై వివరాలు తెలుసుకున్నారు. మాస్టర్ ప్లాన్, అనుబంధ భవనం, పరిపాలనా భవనం, శాసనసభా పక్ష కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం, పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. (వివరాలు 2లో..)





నిన్నొక పంచాయితీ, నేడొకటి

కాంగ్రెస్‌లో నేతల మధ్య పోరు
శ్రీధర్‌బాబుకు ఎంపీ చురకలు
ఢిల్లీ సభకు గైర్హాజరుపై వ్యంగ్యాస్త్రాలు
ఎంపీపై దుద్దిళ్ల అనుచరులు ఎదురుదాడి

ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య హస్తిన వేదికగా యుద్ధం సద్దుమణగకముందే.. కాంగ్రెస్ పార్టీలో మరో పంచాయితీ మొదలైంది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రాసిన లేఖ తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ చర్చకు తెరలేపింది. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ నిర్వహించిన భారీ సభకు హాజరుకాని నేతల వ్యవహారాన్ని ఎంపీ తన లేఖలో ప్రస్తావించారు. (వివరాలు 2లో..)

వచ్చే బోనాలకల్లా ఇందిరమ్మ టవర్స్ సిద్ధం!

పేదలకు సొంతింటి కల.. 1,920 ఇళ్లకు ఈ-లాటరీ
భూముల సేకరణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

హైదరాబాద్‌లో సొంతింటి కలను నిజం చేసుకునేందుకు ఎదురుచూస్తున్న పేదలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సొంత స్థలం లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మించి అందించడంతో పాటు, సొంతంగా భూములు కలిగి ఉండి అర్హత ఉన్నవారికి కూడా త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. (2లో..)

ఎమ్మెల్సీ ఓటరుగా చేరేందుకు మరో ఛాన్స్

2లో..

నవంబర్ 6 తర్వాత కూడా దరఖాస్తులు
గడువు పొడిగింపు, డిసెంబర్ 30న జాబితా

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందాలనుకునే వారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. నవంబర్ 6వ తేదీతో దరఖాస్తుల గడువు ముగిసినా, ఆ తర్వాత కూడా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

నిన్నొక పంచాయితీ, నేడొకటి
కాంగ్రెస్‌లో నేతల మధ్య పోరు

- శ్రీధర్‌బాబుకు ఎంపీ చురకలు

మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ సభకు హాజరుకాలేదని గుర్తుచేశారు. అదే సమయంలో మంథనిలో జరిగిన శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, పార్టీ కార్యక్రమాలకు గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు వర్తించవా? అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఈ మేరకు నవంబర్ 2న మంత్రి శ్రీధర్‌బాబుకు లేఖ రాశారు.

పేద విద్యార్థులకు బ్యాగుల పంపిణీపై ప్రశ్న

తాజా ఉదంతాన్ని గతంలో జరిగిన సంఘటనతో పోల్చి ఎంపీ వంశీ కృష్ణ విమర్శలుగుప్పించారు. గతంలో మంథని నియోజకవర్గంలోని కొయ్యూరులో కాకా వెంకటస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశామని... ఆ కార్యక్రమంలో తనతో పాటు పాల్గొన్న గిరిజన మహిళా ప్రజాప్రతినిధి, ఉపసర్పంచ్‌పై పార్టీ సస్పెన్షన్ వేటు వేయడాన్ని వంశీకృష్ణ తప్పుబట్టారు. కనీసం షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేద పిల్లలకు బ్యాగులు పంపిణీ చేయడమే క్రమశిక్షణారాహిత్యమైతే, ఢిల్లీ సభకు గైర్హాజరైన ప్రజాప్రతినిధుల విషయంలోనూ అదే నిబంధనలు అమలు చేయాలా? అని నిలదీశారు. సహజ న్యాయసూత్రాలను పాటిస్తూ ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావులపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవద్దని, వారిని సస్పెన్షన్ నుంచి మినహాయించాలని వ్యంగ్యంగా కోరారు.

మంత్రికి అండగా కరీంనగర్ కాంగ్రెస్ నేతలు

ఎంపీ లేఖపై మంథనిలో కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్వామీజీని మంథనికి తీసుకొచ్చి ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించడం వెనుక ప్రజల్లో సోదరభావం పెంపొందించాలనే ఉద్దేశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రజాధనం ఖర్చు చేయలేదని, మంత్రి తన సొంత నిధులతోనే నిర్వహించారని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలనే లక్ష్యంతో శ్రీధర్‌బాబు పనిచేస్తున్నారని, పార్టీ బలోపేతానికి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ కృషి చేస్తున్నారని నేతలు పేర్కొన్నారు. ఎంపీ వంశీకృష్ణ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, అనవసర విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

మంథని మెజార్టీ గుర్తు చేసిన నేతలు

ఎంపీ వంశీకృష్ణవ్యవహారశైలిపైనా కాంగ్రెస్ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మంథని పర్యటనలకు వస్తున్నప్పుడు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మండల పార్టీ నాయకులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. మంథని ప్రజలు భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించేందుకు కష్టపడితే, ఈ ప్రాంతానికి ఆయన ఏమి చేశారని ప్రశ్నించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల కృషిని గుర్తించాలని సూచించారు. మంత్రి శ్రీధర్‌బాబుపై చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఎంపీ వ్యవహారశైలిపై నేతకాని సంఘం తరఫున రాహుల్ గాంధీకి ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్, ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావుతో పాటు పలువురు నాయకులు ఈ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. దీంతో పెద్దపల్లి కాంగ్రెస్‌లో నెలకొన్న విభేదాలు మరోసారి బహిరంగ చర్చకు వచ్చాయి.



తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై కీలక ఆదేశాలు

- మహారాష్ట్రతో వేగంగా చర్చలు పూర్తవ్వాలి
- ముంపు పరిహారానికి సిద్ధమని స్పష్టీకరణ
- నిరంతర సంప్రదింపులతో ఫలితాలు: సీఎం



తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు సంబంధించిన పూర్తి వివరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు, ఇతరకీలక అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్ర అధికారులకు అందజేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు ముందుకు సాగేందుకు అవసరమైన సమాచారం, సాంకేతిక వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

ముంపు భూములకు పరిహారం చెల్లిస్తాం

జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్రతో ఇటీవల జరిగిన చర్చల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ముంపు పరిహారంపై సీఎం కీలక హామీ ఇచ్చారు. మహారాష్ట్ర పరిధిలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. భూముల ముంపుపై మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సర్వే నిర్వహించినా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. సర్వేకు అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు.

పత్రాలు సిద్ధం చేయాలని ఆదేశం

మహారాష్ట్ర అధికారులకు అవసరమైన సమాచారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సీఎం ఆదేశించారు. ఇప్పటికే కుదిరిన ఒప్పందాలు, ముంపు వివరాలు, పరిహారానికి సంబంధించిన అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకుంటూ బ్యారేజ్ నిర్మాణానికి ముందడుగు వేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ (జనరల్) రమేష్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహారాష్ట్రతో చర్చలు, ముంపు పరిహారం, అవసరమైన నిధుల సమీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది.



అర్హుల ఓట్లు తొలగిస్తే సహించం

ప్రతి ఓటుకూ లెక్క చెప్పాల్సిందే
రాహుల్ నాయకత్వం భేషన్న ఉత్తమ్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తే సహించేది లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఓటరు పేరు తొలగింపు వెనుక సరైన కారణం ఉండాలని, ఎన్నికల సంఘం ప్రతి తొలగింపునకు లెక్క చెప్పాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. నకిలీ ఓట్లు, అనర్హుల పేర్లను తొలగించడాన్ని ఎవరూ వ్యతిరేకించరని, అయితే నిజమైన ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చూడటం ఎన్నికల సంఘం బాధ్యత అని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని ప్రశంసించారు. భిన్నమైన రాజకీయ నేపథ్యాలు, ప్రాంతీయ ప్రయోజనాలున్న పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఇండియా కూటమి తరఫున ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారని కొనియాడారు.

ఎన్నికల సంఘం జవాబుదారీతనంపై పోరు

ఎస్ఐఆర్‌లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలను ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తావించారు. అక్టోబర్ 12న సుప్రీంకోర్టు వైపు నిర్వహించిన మార్చ్, అక్టోబర్ 31న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై నిర్వహించిన ప్రతీకాత్మక ప్రజా అభిశంసన కార్యక్రమాలను గుర్తుచేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం విపక్షాలు రాజకీయ నిరసనలతో పాటు న్యాయపరమైన మార్గాల్లోనూ పోరాడుతున్నాయని తెలిపారు. ఓటర్ల జాబితాలో ప్రతి మార్పునకు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రజలే నిర్ణయించాలి.. ప్రజాస్వామ్యమే ముఖ్యం

ఇండియా కూటమిని ఏకం చేయడంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషిస్తున్నారని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. విపక్షాల ఐక్య ఉద్యమం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పరిణామంగా మారే అవకాశం ఉందన్నారు. కూటమిలో రాహుల్ కేంద్ర నాయకుడిగా ఎదిగారని, ఆయన ప్రధానమంత్రి అయ్యే అవకాశాలపై రాజకీయ చర్చ పెరుగుతోందని వ్యాఖ్యానించారు. అయితే దేశ రాజకీయ భవిష్యత్తును అంతిమంగా నిర్ణయించేది ప్రజలేనని స్పష్టం చేశారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు భద్రంగా ఉండేలా చూడాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని ఉత్తమ్ పేర్కొన్నారు.

వచ్చే బోనాలకల్లా ఇందిరమ్మ టవర్స్ సిద్ధం!

ప్రతి నియోజకవర్గానికి 5,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, హైదరాబాద్‌లో స్థలాల కొరత కారణంగా ప్రత్యామ్నాయంగా టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను పేదల నివాసాల కోసం వినియోగిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీతో పాటు పోలీసు శాఖ భూములను కూడా ఇందుకోసం కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తిస్తున్నామని, వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసేలా నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

నాలుగు నియోజకవర్గాల్లో 1,920 ఇళ్ల కేటాయింపు

గోషామహల్, ముషీరాబాద్, ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో నిర్మించనున్న 1,920 ఇందిరమ్మ టవర్స్ ఇళ్లకు మంగళవారం సాంకేతిక పరిజ్ఞానంతో ఈలాటరీ నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రాజాసింగ్ ఈ ప్రక్రియను ప్రారంభించారు. త్వరలోనే నిర్మాణాలకు భూమిపూజ నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లోనే పేదలకు ఇళ్లు కల్పించాలన్నప్రభుత్వలక్ష్యాన్నిఎమ్మెల్యేరాజాసింగ్ స్వాగతించారు. నియోజకవర్గంలో మరిన్ని నిర్మాణాలకు అనువైన భూములను గుర్తించాలని కోరారు. హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపి గౌతం మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్లు అందేవరకు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలు కొనసాగిస్తామని చెప్పారు. లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మాణాలు చేపట్టాలనే ఉద్దేశంతో ఒక్కో ఇంటి ధరను రూ.6 లక్షలుగా నిర్ణయించామని వివరించారు. మార్కెట్‌లో రూ.40 నుంచి రూ.50 లక్షల విలువ చేసే ఇంటిని తక్కువ ధరకు అందించడంతో పాటు రిజిస్ట్రేషన్ కూడా ఉచితంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ఎంపికైన వారికి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు.

నేడు 1,700 ఇళ్లకు మాప్‌అప్ లాటరీ

గతంలో 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల కేటాయింపునకు లాటరీ నిర్వహించగా, క్షేత్రస్థాయి పరిశీలనలు ఇతర కారణాలతో 14 నియోజకవర్గాల్లో సుమారు 1,700 ఇళ్లు తిరిగి అందుబాటులోకి వచ్చాయి. వీటిని అర్హులైన దరఖాస్తుదారులకు కేటాయించేందుకు నవంబర్ 4న, బుధవారం మాప్‌అప్ ఈలాటరీ నిర్వహించనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితా నుంచే లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించనున్నట్లు అధికారులు తెలిపారు. లాటరీని ప్రత్యక్షంగా వీక్షించేందుకు https://youtube.com/@tghd.official యూట్యూబ్ ఛానల్‌లో లైవ్ ప్రసారం ఏర్పాటు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మరో నాలుగు నియోజకవర్గాలకు కూడా త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వెల్లడించారు.





కేంద్ర నిధులన్నీ రాబట్టుకోవాలి

శాఖలకు డిప్యూటీ సీఎం దిశానిర్దేశం

కేంద్ర పథకాల మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతలకు అనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. నిధుల కోసం అవసరమైన దరఖాస్తులు, నివేదికలను సకాలంలో కేంద్రానికి పంపాలని ఆదేశించారు.

ఖర్చుతోపాటు ఫలితాలపైనా నజర్

కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి గరిష్ఠంగా నిధులు తీసుకురావాలని భట్టి సూచించారు. ఈ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా 40 శాతం నిధులు సమకూరుస్తున్నందున, ఖర్చుల లెక్కలతో పాటు ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను కూడా నిరంతరం పరిశీలించాలని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యక్షంగా ఉపయోగపడే పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. కేంద్ర శాఖలతో సమన్వయం కోసం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పనిచేస్తున్న లైజన్ అధికారుల సేవలను అన్ని శాఖలు వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లోని అంశాలపై తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూలధన పెట్టుబడుల కోసం కేంద్రం అందించే ప్రత్యేక సహాయ పథకాన్ని కూడా గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా నీటిపారుదల, పట్టణాభివృద్ధి, రవాణా, వ్యవసాయం, వైద్య ఆరోగ్య శాఖలు కేంద్ర పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సాంకేతిక సమస్యలు, పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

పెండింగ్ బిల్లుల పరిష్కారానికి చర్యలు

కేంద్ర నిధుల విడుదలలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు శాఖల మధ్య సమన్వయం పెంచాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. పథకాల అమలులో పురోగతి ఉంటేనే భవిష్యత్తులో అదనపు నిధులు సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్ర వాటా నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించామని, బిల్లులను క్రమబద్ధంగా క్లియర్ చేస్తున్నామని వివరించారు. వివిధ శాఖల్లో పథకాల అమలు, నిధుల ఖర్చు, ప్రస్తుత పరిస్థితిపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ సమీక్షలో వివరాలు అందించారు. కేంద్ర నిధుల సాధనతో పాటు వాటి ద్వారా ప్రజలకు పూర్తి ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని భట్టి దిశానిర్దేశం చేశారు.

మళ్లీ పీఠం కాంగ్రెస్‌దే!

తెలంగాణలో బీజేపీకి అధికారం కల్లే

- కేంద్రంలోనూ హస్తం ప్రభుత్వమే: పొంగులేటి



వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందంటూ కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు పగటి కలలేనని కాంగ్రెస్ నాయకుడు విమర్శించారు. తెలంగాణ ప్రజలు బీజేపీని నమ్మే పరిస్థితి లేదని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నికల సంఘాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని, ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించిందని ఆరోపించారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలకు పాల్పడుతున్న పార్టీకి తెలంగాణలో ప్రజల మద్దతు లభించదని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పనితీరుపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థల విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తుందన్న అమిత్ షా ప్రకటనలకు ప్రజలే ఎన్నికల్లో సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు.

కాళేశ్వరం అవినీతిపై చర్యలేవీ?

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరిగాయని ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని, ప్రజల ముందు రాజకీయ విమర్శలు చేసుకుంటూ లోపల మాత్రం ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం వ్యవహారంలో కేంద్రం స్పందించకపోవడం ఈ రెండు పార్టీల మధ్య ఉన్న సంబంధాలపై ప్రశ్నలు లేవనెత్తుతోందని పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, రాజకీయ నాటకాలను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. అవినీతిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు.

కేంద్రంలోనూ ఇందిరమ్మ ఇళ్ల హామీ

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దేశవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను నిజం చేసేలా ఈ పథకాన్ని విస్తరిస్తామని హామీ ఇచ్చారు. పేదలకు గృహ వసతి కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు.

శాసన మండలి ప్రాంగణానికి కొత్త రూపు

- పచ్చదనానికి పెద్దపీట.. మాస్టర్ ప్లాన్ రెడీ
- అభివృద్ధి పనులపై సీఎస్ పరిశీలన

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. శాసనసభ స్పీకర్, శాసన మండలి చైర్మన్, వైస్ చైర్మన్, డిప్యూటీ స్పీకర్‌తో పాటు శాసనసభ, మండలి కార్యదర్శుల నివాస భవనాల నిర్మాణ ప్రతిపాదనలపై వివరాలు తెలుసుకున్నారు. మాస్టర్ ప్లాన్, అనుబంధ భవనం, పరిపాలనా భవనం, శాసనసభా పక్ష కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం, పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. పర్యాటక శాఖకు చెందిన భూమిని శాసనసభకు బదిలీ చేయడంతో పాటు, పక్కనే ఉన్న డీజీపీ కార్యాలయానికి సంబంధించిన కొంత భూమిని కూడా కేటాయించే ప్రతిపాదనను పరిశీలించారు.

పచ్చదనానికి విఘాతం కలగకుండా అభివృద్ధి

ప్రతిపాదిత నిర్మాణాలకు గుర్తించిన స్థలాలు, ప్రస్తుత పరిస్థితులు, ఇంజినీరింగ్ అంశాలపై సంబంధిత అధికారులను సీఎస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ ప్రాజెక్టులో పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న పచ్చదనాన్ని కాపాడుతూ, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడకుండా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల పేరుతో చెట్లకు, సహజ వాతావరణానికి నష్టం కలగకూడదని దిశానిర్దేశం చేశారు. శాసనసభ ప్రాంగణ విస్తరణతో పాటు అన్ని అనుబంధ సౌకర్యాలను సమగ్రంగా అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ నయీముద్దీన్, ఆర్అండ్‌బీ ఎస్ఈ మాధవి, ఈఈ మనోహర్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



డిస్మిస్ అయిన వారికి రీ-ఎంట్రీ

ఇందుకోసం హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో డిస్మిస్ అయిన కార్మికులకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని పలువురు కోరారు. దీనిపై స్పందించిన భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో 01.04.2026 నాటికి 46 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని యాజమాన్యం ప్రకటించింది.

అర్హతలు ఇవే.. గడువు నవంబర్ 14

తొలగింపునకు ముందు ఐదు క్యాలెండర్ సంవత్సరాల్లో ఏవైనా రెండేళ్లలో కనీసం 100 మస్టర్లు పూర్తిచేసి ఉండాలి. జనరల్ అసిస్టెంట్ ట్రైనీ (UG), కేటగిరీ I పోస్టులో తిరిగి నియామకానికి వైద్యపరంగా ఫిట్‌గా ఉండాలి. అర్హులైన మాజీ ఉద్యోగులు నిర్దిష్ట ప్రొఫార్మాలో దరఖాస్తు పూర్తి చేసి, తాము చివరిగా పనిచేసిన గని లేదా విభాగం అధిపతికి సమర్పించాలి. దరఖాస్తులకు నవంబర్ 14, 2026 చివరి తేదీగా నిర్ణయించారు. ఏరియా జనరల్ మేనేజర్లు దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారి వివరాలను తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారులకు గడువులోగా పంపించాలి. మరిన్ని వివరాల కోసం మాజీ ఉద్యోగులు తాము పనిచేసిన గని లేదా సంబంధిత శాఖ అధికారులను సంప్రదించాలని సింగరేణి యాజమాన్యం సూచించింది.

ఎమ్మెల్సీ ఓటరుగా చేరేందుకు మరో ఛాన్స్

- నవంబర్ 6 తర్వాత కూడా దరఖాస్తులు
- గడువు పొడిగింపు, డిసెంబర్ 30న జాబితా

వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఫారం 18 ద్వారా నవంబర్ 6 వరకు మాత్రమే కాకుండా, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు జరిగే క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ సమయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పొరుగు ఎలాంటి గందరగోళం లేకుండా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 25న రెండు పట్టభద్రుల నియోజకవర్గాలకు ముసాయిదా ఓటర్ల జాబితాలు విడుదల కానున్నాయి. డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఆ తర్వాత కూడా తుది జాబితా ప్రచురణ నుంచి ఆయా నియోజకవర్గాల్లో నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఫారం 18 ద్వారా పేర్లు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని సీఈఓ తెలిపారు. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు వచ్చే ఏడాది మార్చిలో ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఎన్నికల తేదీని ఎన్నికల సంఘం ఇంకా ప్రకటించలేదు. పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.



మునుగోడుకు నిధులివ్వరా?

అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలా పోరాడాలా? మంత్రుల తీరుపై రాజన్న బహిరంగ అసంతృప్తి

నిధుల కేటాయింపులో వివక్ష ఎందుకు?

మునుగోడు నియోజకవర్గానికి జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీరును బహిరంగ వేదికపై ప్రశ్నించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేవలం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకే పరిమితమయ్యారా? లేక రాష్ట్రానికి ఇరిగేషన్ మంత్రిగా పనిచేస్తున్నారా? అని నిలదీశారు. నిధుల కేటాయింపులు, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో మునుగోడుపై వివక్ష చూపుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

రూ.300 కోట్లు ఇస్తే సస్యశ్యామలం చేస్తా!

మునుగోడు నియోజకవర్గానికి రూ.200 నుంచి రూ.300 కోట్లు కేటాయిస్తే చాలని, ఆ నిధులతో నియోజకవర్గాన్ని పూర్తిగా సస్యశ్యామలం చేసే బాధ్యత తనదేనని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్నోసార్లు ప్రతిపాదనలు పంపించానని, పలుమార్లు విజ్ఞప్తి చేశానని తెలిపారు. అయినా నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. హుజూర్‌నగర్, కోదాడ మినహా ఇతర ప్రాంతాలు మంత్రులకు కనిపించడం లేదా? అంటూ నిలదీశారు. నాంపల్లి మండలంలోని గొలుసుకట్టు చెరువులు, కుంటలు నింపితే అనేక గ్రామాలకు సాగునీరు అందుతుందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమేర పనులు జరిగినప్పటికీ ప్రస్తుతం నిధుల కేటాయింపులు సక్రమంగా లేవని విమర్శించారు.

అధికారంలో ఉండి ప్రతిపక్షంలా మాట్లాడాలా?

హుజూర్‌నగర్ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్లు, మోటార్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారని, మునుగోడు విషయంలో మాత్రం తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పక్షంలో ఎమ్మెల్యేగా ఉండి కూడా నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలా మాట్లాడాల్సిన పరిస్థితి రావడం తన కర్మ అంటూ వాపోయారు. పెద్దపెద్ద మంత్రులు, నాయకులు ఉన్నప్పటికీ డీఎంఎఫ్‌టీ, ఎన్‌ఆర్‌జీఎస్ నిధులన్నీ ఇతర ప్రాంతాలకే తరలిపోతున్నాయని, మునుగోడు అభివృద్ధికి మాత్రం నిధులు అందడం లేదని మండిపడ్డారు.

పవర్‌ఫుల్ లీడర్ కావడమే శాపమైందా?

తాను పెద్ద నాయకుడినని చెప్పుకుంటున్నప్పటికీ, కలెక్టర్ల స్థాయిలో తనకు ఉన్న క్రెడిబిలిటీ, కెపాసిటీకి తగిన గుర్తింపు లభించడం లేదని రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. తనకు రావాల్సిన పదవులు, నిధులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "నేను పవర్‌ఫుల్ లీడర్ట.. అదే మునుగోడు ప్రజలకు శాపమైంది!" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు పదవులు రాకుండా చేయడం, నియోజకవర్గానికి నిధులు విడుదల కాకుండా అడ్డుకోవడం జరుగుతోందన్నది పంద శాతం నిజమని స్పష్టం చేశారు. అధికార పార్టీలో ఉంటూనే సొంత నియోజకవర్గం అభివృద్ధి కోసం బహిరంగంగా గళమెత్తడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది.

మద్యం మహమ్మారిపై సమరభేరి

ఆదర్శ పథంలో రాజన్న రహదారి

మద్యం మహమ్మారికి మరో కుటుంబం బలైంది. భర్త తాగుడుకు బానిసై పెడుతున్న వేధింపులు, కుటుంబంలో ఎదురవుతున్న కష్టాలను భరించలేక ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడిన హృదయవిదారక ఘటన మునుగోడు ప్రాంతంలో కలకలం రేపింది. ఈ విషాదం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని తీవ్రంగా కలచివేసింది. వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలిచారు. మరోవైపు అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

వారం రోజుల్లో 19 గ్రామాల జాబితా ఇవ్వాలి!

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం స్థానిక ఎస్సైతో ఫోన్‌లో మాట్లాడిన రాజగోపాల్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. 19 గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడ ఏం జరుగుతుందో పోలీసులు నిరంతరం గమనించాలని, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని ఆదేశించారు. "ఇక్కడ పని చేయాలంటే బెల్ట్ షాప్‌లను కంట్రోల్ చేయడమే మొదటి కండిషన్" అని స్పష్టం చేశారు. వారం రోజుల్లో 19 గ్రామాల్లో ఎక్కడెక్కడ ఎంతమంది అక్రమ సారాయి విక్రయిస్తున్నారో పూర్తి జాబితా సిద్ధం చేసి తనకు అందించాలని ఆదేశించారు. "లేకపోతే ఇక్కడ ఉండాల్సిన అవసరం లేదు" అంటూ పోలీసులకు తేల్చి చెప్పారు.

తాగుడు కష్టాలు.. కన్నీటి గాథలు!

మద్యం కారణంగా కుటుంబాలు ఎలా చిన్నాభిన్నమవుతున్నాయో ఈ ఘటన మరోసారి నిరూపించిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. భర్త తాగుడుకు బానిసై అప్పులపాలవడం, మద్యం తాగి పచ్చి భారయను వేధించడం చివరకు ఆమె ప్రాణాలు తీసుకునే పరిస్థితికి దారితీయడం బాధాకరమన్నారు. "తాగుడు ఎక్కువై ఇలాంటి కష్టాలు వస్తున్నాయి.. ఎన్నో కుటుంబాలు నాశనమైపోతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్‌షాపుల నిషేధం కేవలం ఒక నిర్ణయం కాదని, ఎన్నో కుటుంబాలను, ప్రాణాలను కాపాడే బాధ్యత అని పేర్కొన్నారు.

పిల్లల చదువు బాధ్యత నాదే!

తల్లిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న చిన్నారులను చూసి రాజగోపాల్‌రెడ్డి చలించిపోయారు. వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ తక్షణ ఆర్థిక సాయంగా రూ.10 వేల నగదును అందజేశారు. అంతటితో ఆగకుండా పిల్లలు పదో తరగతి వరకు చదువుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తన సిబ్బందిని ఆదేశించారు. ఫౌండేషన్ తరపున వారి చదువు ఫీజులు, ఇతర విద్యా ఖర్చులన్నీ పూర్తిగా భరించాలని స్పష్టం చేశారు.

మరో కుటుంబానికి విషాదం వద్దు

మద్యం వ్యసనం ఒక్క వ్యక్తినే కాకుండా కుటుంబం మొత్తాన్ని ఎలా కుంగదీస్తుందో ఈ ఘటన చాటిచెబుతోంది. అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్‌షాపుల నియంత్రణపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే చేసిన హెచ్చరిక ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది. బాధిత పిల్లల చదువు బాధ్యత తీసుకోవడంతో పాటు, ఇలాంటి విషాదాలు మరే కుటుంబంలోనూ పునరావృతం కాకూడదన్న లక్ష్యంతో ఆయన స్పందించారు. ప్రజల కష్టాల్లో తోడుగా ఉంటానన్న తన మాటకు కార్యరూపం చూపించే ప్రయత్నం చేశారు.





ఓటర్ల తొలగింపుపై పరకాల ప్రశ్నల వర్షం

- ఎస్ఐఆర్‌పై తీవ్ర అభ్యంతరాలు
- ప్రభుత్వాల ఎన్నికలపైనా నిలదీత
- మూడు కోట్ల మంది విదేశీయులా?

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఆర్థికవేత్త, రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ ద్వారా సమాజంలోని అణగారిన వర్గాలకు ఓటు హక్కు దూరం చేసి, దేశంలో రెండు రకాల పౌరులను సృష్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మూడు కోట్ల మంది తొలగించిన ఓటర్లను బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులుగా పేర్కొన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక ప్రశ్నలు సంధించారు. ఓటర్ల జాబితాలో ఇంతమంది విదేశీయులు ఉన్నారని భావిస్తే, 2024, 2019, 2014 ఎన్నికల విశ్వసనీయతను కూడా ప్రశ్నించాల్సి వస్తుందని అన్నారు. ఆ ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వాలు కూడా అక్రమమైనవిగా భావించాలా? అని నిలదీశారు. అదే నిజమైతే రాజీనామా చేసి, ఓటర్ల జాబితా ప్రక్షాళన తర్వాత మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఓటర్ రైట్స్ ఫోరం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

తొలగించిన ఓటర్లు ఎక్కడికి వెళ్లారు?

శాశ్వతంగా వలస వెళ్లినట్లు గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించినవారు మరో ప్రాంతానికి వెళ్లి ఉంటారని, అక్కడ ఓటర్ల సంఖ్య పెరగాల్సి ఉంటుందని పరకాల ప్రశ్నించారు. కానీ దేశంలోని అన్ని రాష్ట్రాలు, నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య తగ్గుతోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమ వలసదారుల జాబితాను నాలుగు వారాల్లో సమర్పించాలని మే 27న సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. ఐదు నెలలు గడిచినా కనీసం చిన్న జాబితా కూడా ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. రాష్ట్రాలవారీగా అక్రమ వలసదారుల సంఖ్య వెల్లడించకుండా హోంమంత్రి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. విద్యావేత్త జి. హరగోపాల్ మాట్లాడుతూ విశ్వసనీయత లేని ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కోరారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు.

ఓటర్ల హక్కులపై ప్రజా విచారణకు డిమాండ్


విద్యావేత్త పద్మజా షా తిరుమలగిరి పోలింగ్ కేంద్రంలో 1,062 మంది ఓటర్లకు గాను కేవలం 163 మందిని మాత్రమే ఎలాంటి తొలగింపులు, నోటీసులు లేకుండా ఆమోదించారని వివరించారు. తెలంగాణలో 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే 22 లక్షల మంది ఓటర్ల తొలగింపుతో ఈ సమస్య మొదలైందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌ను నోట్ల రద్దు, కొవిడ్ సమయంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులతో పోల్చారు. కార్యకర్త ఎస్.క్యూ. మసూద్ మాట్లాడుతూ తొలగించిన ఓటర్లను ఫారం 6 ద్వారా తిరిగి చేర్చే విధానం అక్రమ తొలగింపులను కప్పిపుచ్చే ప్రయత్నమని ఆరోపించారు. సేకరించిన సమాచారాన్ని ఓటర్ల ప్రొఫైలింగ్, నిఘా కోసం ఉపయోగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బూత్ లెవల్ అధికారులపై నిందలు వేయకుండా, ప్రక్రియలోని లోపాలను సరిచేయాలని కిరణ్ కుమార్ విస్సా డిమాండ్ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రజా విచారణ నిర్వహించాలని కోరారు. ముషీరాబాద్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఓటర్ల తొలగింపులపై ఫోరం నిర్వహించిన సామాజిక ఆడిట్ వివరాలను సమావేశంలో చర్చించారు.

సంక్షేమ పథకాలకు ఓటరు కార్డే ఆధారం!

- ఆధార్‌కు స్వస్తి.. ఇక ఈపీఐసీతోనే లబ్ధిదారుల గుర్తింపు

సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపులో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పునకు సిద్ధమవుతోంది. ఇప్పటివరకు ఆధార్ ఆధారంగా జరుగుతున్న నగదు చెల్లింపులకు బదులుగా ఇకపై ఓటరు గుర్తింపు కార్డు (ఈపీఐసీ)ను ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తోంది. ఓటరు కార్డుతో పాటు బయోమెట్రిక్ ధ్రువీకరణను తప్పనిసరి చేయాలని నిర్ణయించింది. నకిలీ లబ్ధిదారులను ఏరివేసి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకే అందించడమే లక్ష్యమని కేంద్ర మంత్రి లల్లన్ సింగ్ చెబుతున్నారు. అయితే ఓటరు జాబితాలపై రాజకీయ వివాదాలు కొనసాగుతున్న వేళ ఈ ప్రతిపాదన కొత్త చర్చకు తెరలేపుతోంది.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపు విధానంలో కీలక మార్పు రానుంది. ఇకపై ఆధార్ కార్డుకు బదులుగా ఓటరు గుర్తింపు కార్డు (ఈపీఐసీ) నంబర్‌ను ప్రామాణికంగా తీసుకోవాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లల్లన్ సింగ్ వెల్లడించారు. ఓటరు కార్డుతో పాటు బయోమెట్రిక్ ధ్రువీకరణ తప్పనిసరి చేసి, దాని ఆధారంగానే సంక్షేమ పథకాల నగదు చెల్లింపులు చేపడతామని నవంబర్ 3న స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆధార్ ఆధారంగా లబ్ధిదారులకు చెల్లింపులు జరుగుతున్నాయని, ఇకపై అది ప్రధాన గుర్తింపు పత్రంగా ఉండబోదని తెలిపారు. గ్యాంగ్‌టక్‌లో సిక్కిం కోఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ విషయాలు వెల్లడించారు. గత శుక్రవారం ఢిల్లీలో జరిగిన మంత్రిత్వ శాఖ వర్క్‌షాప్‌లోనూ ఇదే ప్రతిపాదనను ప్రస్తావించారు.



అనర్హులకు చెక్.. పారదర్శకతే లక్ష్యం

ఆధార్ కార్డులను సులభంగా పొందే అవకాశం ఉండటంతో నకిలీ లబ్ధిదారులు చేరే ప్రమాదం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఐదు నిమిషాల్లోనే ఆధార్ కార్డు పొందవచ్చంటూ వ్యాఖ్యానించారు. ఈపీఐసీ నంబర్‌తో బయోమెట్రిక్ వివరాలను జతచేయడం ద్వారా నిజమైన లబ్ధిదారులను గుర్తించవచ్చని, అనర్హుల పేర్లను తొలగించి ప్రభుత్వ సాయం అర్హులకే అందించవచ్చని పేర్కొన్నారు. మరోవైపు, ఓటరు జాబితాల్లో పేర్ల తొలగింపుపై ప్రతిపక్షాలు చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణల నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. 2026-31 కాలానికి 16వ ఆర్థిక సంఘం దేశవ్యాప్తంగా 2.55 లక్షల పంచాయతీలు, సంప్రదాయ స్థానిక సంస్థలకు మొత్తం రూ.4,35,236 కోట్ల నిధుల మంజూరును సిఫారసు చేసింది.

కేన్సర్ వైద్యంపై సర్కార్ ఫోకస్

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు
- ఎంఎన్‌జే, నిమ్స్ వైద్యంపై మంత్రి సమీక్ష

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేన్సర్ బాధితులకు అందుతున్న వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి, నిమ్స్‌లో రోగులకు అందుతున్న చికిత్సలు, వైద్య సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ రెండు ఆసుపత్రుల్లో కేన్సర్ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సా విధానాలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను అధికారులు మంత్రికి వివరించారు. అలాగే జిల్లాల్లో ఏర్పాటు చేసిన కీమోథెరపీ కేంద్రాల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. ఆయా కేంద్రాల్లో రోగులకు చికిత్స సక్రమంగా అందుతోందా? అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారా? అనే అంశాలను సమీక్షించారు. జిల్లా స్థాయిలోనే కేన్సర్ బాధితులకు మెరుగైన చికిత్స అందించేలా వైద్య వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

కేన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపుపై దృష్టి

కేన్సర్‌ను ప్రభుత్వం ఇటీవల నోటిఫయబుల్ వ్యాధిగా ప్రకటించడంతో పాటు కేన్సర్ రిజిస్ట్రీ, ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో కేన్సర్ కేసుల వివరాలను సమగ్రంగా నమోదు చేయడం, వ్యాధి తీవ్రతను అంచనా వేయడం, చికిత్సా సేవలను మెరుగుపరచడం ఈ చర్యల ప్రధాన ఉద్దేశం. తాజా సమీక్షలో కేన్సర్ నివారణ, ముందస్తు స్క్రీనింగ్, వ్యాధి గుర్తింపు, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సా సౌకర్యాలను విస్తరించడం, రోగులకు సకాలంలో వైద్యం అందించడం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.









అనంత కార్పొరేషన్‌లో వైసీపీ జెండా

- రమేష్ గౌడ్ అనూహ్య విజయం

అనంతపురం ఎన్నికల కౌంటింగ్‌లో వైసీపీ అభ్యర్థి రమేష్ గౌడ్ విజయం సాధించారు. అధికారికంగా వెల్లడించిన ఓట్ల లెక్కల ప్రకారం రమేష్ గౌడ్‌కు మొత్తం 45,240 ఓట్లు లభించాయి. రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి కె. అజయ్ బాబుకు 40,849 ఓట్లు వచ్చాయి. దీంతో రమేష్‌గౌడ్ 4,391 ఓట్ల స్పష్ట మైన మెజారిటీతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. కౌంటింగ్ సరళిని గమనించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేంద్రం నుంచి వెళ్లిపోయారు. అనంతలో రమేష్ గౌడ్ విజయం వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.



సీఎం రేవంత్‌తో సీపీఐ నేతల భేటీ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సీపీఐ రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులతో కూడిన ప్రతినిధి బృందం సమావేశమైంది. ముఖ్యమంత్రిని కలిసిన నేతలు రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీలో సీపీఐ నాయకులు తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, ఇతర కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈ ప్రతినిధి బృందంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటీ నరసింహ పాల్గొన్నారు. వీరితో పాటు కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, కలవేణి శంకర్, బాల నరసింహ, బి. హేమంతరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు ఒకే బృందంగా ముఖ్యమంత్రితో సమావేశం కావడం ఈ భేటీకి ప్రాధాన్యతను తీసుకొచ్చింది.



ఐక్యతతో కార్మికుల సమస్యకు పరిష్కారం

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో కార్మికుల ఐక్యతతో తొలగింపు సమస్యకు పరిష్కారం లభించింది. గత సంఘటన నేపథ్యంలో విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించిన తొమ్మిది మంది కార్మికులకు తిరిగి ఉద్యోగ అవకాశం దక్కింది. ఈ నిర్ణయంపై మున్సిపల్ డ్రైవర్లు, యూనియన్ నాయకులు ఏకమై కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. ఇకపై విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా పనిచేస్తామని,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ తొమ్మిది మందిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమస్య పరిష్కారానికి సహకరించిన కమిషనర్‌కు యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.



ఫోర్జరీ లేఖతో బీసీలను తప్పుదోవ పట్టిస్తున్నారా?

ప్రొద్దుటూరులో బీసీలకు రాజకీయ అన్యాయం చేస్తున్నానంటూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తీవ్రంగా ఖండించారు. మున్సిపల్ చైర్మన్ పదవిని ఓసీలకు కేటాయించాలని తాను లేఖ రాసినట్లు ప్రచారంలో ఉన్న పత్రం ఫోర్జరీదని స్పష్టం చేశారు. ఆ లేఖతో తనకు సంబంధం లేదని, దాని వెనుక వాస్తవాలు వెలికితీసేందుకు ఫోర్జరీ కేసు నమోదు చేస్తానని ప్రకటించారు. టీడీపీ ప్రభుత్వం బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తోందని, మున్సిపల్ ఎన్నికల్లో 52 స్థానాలకు 30 స్థానాలు బీసీలకు కేటాయించడమే అందుకు నిదర్శనమన్నారు. మార్కెట్ యార్డు, పార్టీ పదవుల్లోనూ బీసీలకు అవకాశాలు కల్పించామని వివరించారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని రాచమల్లుకు హితవు పలికారు.



కురుమూర్తి జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ డి.జానకి తెలిపారు. నవంబర్ 10 నుంచి ప్రారంభం కానున్న జాతర ఏర్పాట్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆలయ పరిసరాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో సమీక్షించారు. నవంబర్ 16న జరిగే ఉద్ధాల ఉత్సవానికి భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు ముందుగానే పూర్తి చేయాలన్నారు. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతర నిర్వహించాలని స్పష్టం చేశారు.

చీరాలపై మురసు తుఫాను పంజా..

అంధకారంలో పట్టణం

కుండపోత వర్షం.. విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

చీరాల, నవంబర్ 03: బాపట్ల జిల్లా చీరాలపై మురసు తుఫాను తీవ్ర ప్రభావం చూపుతోంది. సోమవారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురుస్తుండటంతో పట్టణం అతలాకుతలమైంది. బలమైన గాలులకు ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో పాటు వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో చీరాల పట్టణం అంధకారంలో మునిగిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు రంగంలోకి దిగి కూలిన చెట్లను తొలగిస్తూ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. మరోవైపు భారీ వర్షాలతో ప్రధాన రహదారులు, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై, ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



వాడరేవులో ఉగ్రరూపం.. మత్స్యకారుల తరలింపు

తుఫాను ప్రభావంతో వాడరేవు సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. సముద్రం ముందుకు చొచ్చుకొస్తూ భారీ అలలతో ఉగ్రరూపం దాల్చింది. తీరప్రాంతాల్లో పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మత్స్యకారులను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించింది. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తుఫాను తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం, రహదారులపై చెట్లు కూలిపోవడం, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.



మురసు తుఫాను దెబ్బ.. చీరాల కౌంటింగ్ వాయిదా

మురసు తుఫాను ప్రభావంతో చీరాల మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు వాయిదా పడింది. పట్టణంలో రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలులతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవడంతో ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. తుఫాను సహాయక చర్యలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎన్నికల యంత్రాంగం కౌంటింగ్ తేదీని మార్చింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 6న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. అదే రోజు తుది ఫలితాలు వెల్లడికానున్నాయి. మరోవైపు బ్యాలెట్ బాక్సుల భద్రతకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేసి, టార్పాలిన్ కవర్లతో రక్షణ కల్పిస్తున్నారు.



కూటమిపై ప్రజల నమ్మకానికి నిదర్శనం: గంటా

విశాఖపట్నం జీవీఎంసీ ఎన్నికల ఫలితాలు ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిబింబమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. పోలింగ్ శాతం తక్కువగా నమోదైనా పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలిచారని తెలిపారు. యువ మేయర్ ముక్కా శ్రావణి అత్యధిక మెజారిటీతో గెలవడంపై అభినందనలు తెలుపుతూ విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. గాజువాక, భీమిలి, పెందుర్తి నియోజకవర్గాలు రాష్ట్రస్థాయిలో అత్యధిక మెజారిటీలతో వరుసగా 1, 2, 4 స్థానాలు సాధించాయని గుర్తుచేశారు. మేయర్, కార్పొరేటర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలుపుతూ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి మద్దతిచ్చిన విశాఖ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి అభినందనలు

విశాఖపట్నం, నవంబర్ 3: జీవీఎంసీ ఎన్నికల్లో అఖండ మెజారిటీ సాధించిన కూటమి మేయర్, కార్పొరేటర్లకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి శుభాకాంక్షలు తెలిపారు. కూటమికి ఇంతటి ఘన విజయాన్ని అందించిన విశాఖ నగర ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. అభ్యర్థుల గెలుపు కోసం సమన్వయంతో పనిచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ఈ ఫలితాలు ప్రజా విజయానికి, కూటమి పాలనపై ప్రజల మద్దతుకు నిదర్శనమని పేర్కొన్నారు.ఇకపై విశాఖ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని, నగర ప్రజలకు పారదర్శకమైన పాలనతో మెరుగైన సేవలు అందించాలని జీవీఎంసీ నూతన పాలక మండలి సభ్యులకు మంత్రి సూచించారు. నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

అనిల్ అంబానీ గ్రూప్‌పై ఈడీ పంజా!

- రూ.510 కోట్ల ఆస్తులు జప్తు
- 2 విమానాలు, ఆరు స్థలాలు స్వాధీనం



ప్రజాధనం మళ్లింపుపై తీవ్ర ఆరోపణలు..

సీబీఐ, ఢిల్లీ, ముంబయి పోలీసుల ఆర్థిక నేరాల విభాగాలు నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, కమర్షియల్ ఫైనాన్స్ కేసుల్లో రూ.263.05కోట్లు,రిలయన్స్ కమ్యూనికేషన్స్ కేసులో రూ.247.12 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న ప్రజాధనాన్ని ఇతర అవసరాలకు మళ్లించారని, దివాలా చట్టాన్ని దుర్వినియోగం చేసి సంస్థల ఆస్తులను వ్యక్తిగత ప్రయోజనాలకు కాపాడుకున్నారని ఈడీ ఆరోపించింది. ఈ కేసుల్లో ఇప్పటివరకు 10 మందిని అరెస్టు చేయగా, పీఎంఎల్ఏ కింద ఆరు, ఫెమా కింద ఒక ఫిర్యాదు దాఖలైంది. మరోవైపు, అనిల్ అంబానీ ఎలాంటి తప్పు చేయలేదని ఖండించారు.

ఇజ్రాయెల్‌కు వెళ్లి ప్రధాని అవుతా!

యూఎస్‌లో ఆదరణ తగ్గితే అదే దిక్కు!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రజాదరణపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రజలకు తనపై విసుగు వస్తే ఇజ్రాయెల్‌కు వెళ్లి ఆ దేశ ప్రధానమంత్రి అవుతానంటూ చమత్కరించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల పోలింగ్ రోజున ఫాక్స్ న్యూస్ కార్యక్రమం 'ఫాక్స్ అండ్ ఫ్రెండ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్‌లో తనకు 99 శాతం ప్రజాదరణ ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో ప్రజలు తనను ఆదరించడం మానేస్తే ఇజ్రాయెల్‌కు వెళ్లిపోతానని, అక్కడ ప్రధానమంత్రి పదవి చేపడతానని సరదాగా వ్యాఖ్యానించారు. అమెరికాలో తన ఆమోద రేటింగ్ తగ్గుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి.

నెతన్యాహుతో నాలుగు బిలియన్ డాలర్ల ఒప్పందం..

ఇదే ఇంటర్వ్యూలో ఇజ్రాయెల్‌కు అమెరికా అందిస్తున్న ఆర్థిక సాయంపైనా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కొన్ని నెలల క్రితమే ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. ప్రతి ఏడాది ఇజ్రాయెల్‌కు అందించే 4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.36వేల కోట్ల) ఆర్థిక సాయాన్ని ఈ ఏడాది చివరి నుంచి నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్‌కు ఇక ఆ సాయం అవసరం లేదని,అయితే అవసరమైతే అమెరికా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిధుల అంశాన్ని కొందరు డెమొక్రాట్లు, వామపక్ష నేతలు రిపబ్లికన్లపై విమర్శలకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, ట్రంప్ రెండో పదవీకాలానికి కీలక పరీక్షగా భావిస్తున్న మధ్యంతర ఎన్నికల్లో కాంగ్రెస్‌పై పట్టు సాధించేందుకు డెమొక్రాట్లు ప్రయత్నిస్తున్నారు.



మండపేటలో కూటమి చరిత్రాత్మక క్లీన్ స్వీప్

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సరికొత్త చరిత్ర సృష్టించింది. మొత్తం 36 వార్డులకు 36 వార్డులను కైవసం చేసుకుని ప్రత్యర్థులకు ఒక్క స్థానం కూడా దక్కకుండా సంపూర్ణ ఆధిపత్యం చాటింది. వేగుళ్ల అజయ్ బాబు నాయకత్వంలో సాధించిన ఈ విజయం 1981-82 నాటి రాజకీయ రికార్డులను గుర్తుచేస్తోంది. వార్డుల వారీగా టీడీపీ 24, జనసేన 10, బీజేపీ 2 స్థానాల్లో గెలుపొందాయి. ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు వ్యూహాలు, కూటమి పార్టీల సమన్వయం, కార్యకర్తల కృషి ఈ విజయానికి దోహదపడ్డాయని కూటమి శ్రేణులు పేర్కొన్నాయి. ఈ ఫలితంతో మండపేట రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైంది.



తాళాల గల్లంతు.. ఇద్దరు అధికారుల సస్పెన్షన్

పార్వతీపురం మున్సిపల్ కౌంటింగ్ కేంద్రంలో స్ట్రాంగ్ రూమ్ తాళాలు గల్లంతైన ఘటనకలకలం రేపింది. తాళాలు కనిపించకపోవడంతో కౌంటింగ్ ప్రక్రియకు తీవ్ర జాప్యం ఏర్పడింది. ఉదయం 9 గంటలు దాటినా స్ట్రాంగ్ రూమ్ తాళాలు లభించకపోవడంతో ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. విధుల్లో ఉన్న టీపీఎస్ నారాయణరావు, మున్సిపల్ మేనేజర్ ఈశ్వరరావులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు భావిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇద్దరు అధికారుల సస్పెన్షన్ వివరాలను జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ చిన్న రామప్పడు మీడియాకు అధికారికంగా వెల్లడించారు. తాళాల గల్లంతు వ్యవహారం ఎన్నికల నిర్వహణలో అధికారుల బాధ్యతలపై చర్చకు దారితీసింది.

నిరసన హక్కు..వ్యాపార హక్కు రెండూ ముఖ్యమే!

చిరు వ్యాపారులకు ఆదాయం: సుప్రీం కోర్టు క్లారిటీ

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఎంత ముఖ్యమో, జీవనోపాధి కోసం వ్యాపారం చేసుకునే హక్కు కూడా అంతే ముఖ్యమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీలో పండుగల సీజన్‌లో నిరసనల కారణంగా వ్యాపారాలు దెబ్బతింటున్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్న వ్యాపారులు, తోపుడు బండ్ల నిర్వాహకులు, వీధి వ్యాపారుల జీవనోపాధిపై నిరసనల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.

పండుగల వేళ రూ.వేల కోట్ల నష్టం..

ఢిల్లీ వ్యాపారుల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తూ, దసరా, దీపావళి పండుగల సమయంలో నిరసనల వల్ల వ్యాపారాలు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. కనాట్ ప్లేస్‌లో అమ్మకాలు పడిపోయాయని, వేల కోట్ల రూపాయల వ్యాపారం దెబ్బతిందని, అనుబంధంగా పనిచేసే వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని వివరించారు. రామ్‌లీలా మైదానం కూడా కనాట్ ప్లేస్‌కు కేవలం ఒక మైలు దూరంలోనే ఉందని గుర్తుచేశారు. పండుగల సమయంలో రెండు నెలలపాటు నిరసనలను నిషేధించాలని కోరారు. అయితే నిరసన నిర్వాహకులను కూడా పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చలేదని ధర్మాసనం ప్రశ్నించింది. వారిని విచారించకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది.



అనుమతుల ఉల్లంఘనకు తావులేదు..

కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ, నిరసనలకు అనుమతి తీసుకున్నప్పుడు విధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. మరోవైపు, ప్రజాస్వామ్యంలో నిరసనలకు స్థానం ఉందని, వాటిని అడ్డుకోవడం సరికాదని పిటిషన్లను వ్యతిరేకించిన న్యాయవాదులు వాదించారు. నిరసన ప్రదేశాల్లో చిరు వ్యాపారులు కూడా జీవనోపాధి పొందుతున్నారని గుర్తుచేశారు. అన్ని వర్గాల హక్కులను సమన్వయం చేయాల్సిన అవసరాన్ని ధర్మాసనం నొక్కిచెప్పింది.

నిఘా సాంకేతికతపైనా న్యాయస్థానం ప్రశ్నలు..

ఇదే విచారణలో నిరసనకారులపై ఢిల్లీ పోలీసులు ముఖ గుర్తింపు సాంకేతికత, ఐరిస్ స్కానింగ్ వంటి నిఘా విధానాలను ఉపయోగించడంపై దాఖలైన పిటిషన్ల అంశమూ ప్రస్తావనకు వచ్చింది. నేరస్థులను గుర్తించేందుకు ఈ సాంకేతికతను ఉపయోగిస్తున్నామని కేంద్రం వాదించగా, ప్రభుత్వ ప్రయోజనాలతో పాటు వ్యక్తిగత గోప్యత హక్కును కూడా పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ బాగ్చి సూచించారు. నిరసనల్లో మహిళా జర్నలిస్టులపై లైంగిక వేధింపుల ఆరోపణల పరిశీలనకు మహిళా నేతృత్వంలో కమిటీ, ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ కోరారు. వ్యాపారుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అయితే అన్ని పక్షాల వాదనలు విన్న తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.



రూ.25 కోట్ల ధాన్యం మాయం.. మిల్లుపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో ప్రభుత్వ ధాన్యం అక్రమ మళ్లింపు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రఘుపతిపేట రోడ్డులోని శ్రీ సాయి లక్ష్మీ వెంకటేశ్వర ప్యారాబాయిల్డ్ రైస్ మిల్లులో నవంబర్ 2న పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి చెందిన 8,505.586 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ రూ.25,04,42,985గా అధికారులు నిర్ధారించారు. ఒప్పంద నిబంధనలకు విరుద్ధంగా ధాన్యాన్ని దుర్వినియోగం చేసి ప్రభుత్వానికి నష్టం కలిగించారని పౌరసరఫరాల శాఖ మేనేజర్ దందు రాజేందర్ ఫిర్యాదు చేశారు. దీంతో కల్వకుర్తి ఎస్ఐ కేసు నమోదు చేశారు. మిల్లు నిర్వాహకులపై BNS సెక్షన్లు 316(2), 316(5), 318(3), నిత్యావసర సరుకుల చట్టంలోని సెక్షన్ 7 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

తెలంగాణలో అధికారం చేతిలో ఉన్నా.. కాంగ్రెస్‌కు రాజకీయంగా కష్టకాలం మొదలైందా? సొంత పార్టీ నేతలే కత్తులు దూస్తుంటే.. ప్రతిపక్షాలు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయా? పదవుల పంపకాలతో మొదలైన పంచాయితీలు ఢిల్లీ వేదికగా బాహాబాహీ వరకు చేరాయనే ప్రచారం పార్టీ పరువును బజారుకీడుస్తోంది. ఎంపీ లేఖాస్త్రం మరో కలకలం రేపుతోంది. ఈ పరిణామాలను గమనిస్తున్న బీఆర్ఎస్ కేటీఆర్, హరీశ్ రావు విమర్శలతో రేవంత్ సర్కారుపై విరుచుకుపడుతోంది. మరోవైపు తెలంగాణలో అధికారం మాదేనంటూ అమిత్ షా యుద్ధ ప్రకటన చేయడంతో బీజేపీ పోరు కొత్త మలుపు తిరిగింది. ఇంతలో ఎల్‌నినో ముప్పు.. సాగునీటిపై అనిశ్చితి.. హైదరాబాద్‌లో తాగునీటి ఆందోళనలు.. పెరుగుతున్న బియ్యం ధరలు సామాన్యుడిని కలవరపెడుతున్నాయి. మంత్రివర్గ విస్తరణకు మోక్షం లేక ఆశావహుల్లో అసంతృప్తి.. గ్రేటర్ ఎన్నికల ముంగిట రాజకీయ వేడి.. ఇవన్నీ రేవంత్ నాయకత్వానికి అగ్నిపరీక్షగా మారుతున్నాయి. ఒకవైపు సొంతింటిని చక్కదిద్దుకోవాలి.. మరోవైపు ప్రత్యర్థుల దూకుడును అడ్డుకోవాలి.. ఇంకోవైపు ప్రజలకు పాలనపై భరోసా కల్పించాలి. మరి ఈ మూడు ముళ్ల సంక్షోభం నుంచి కాంగ్రెస్ గట్టెక్కుతుందా? తెలంగాణ రాజకీయ చదరంగంలో రేవంత్ తదుపరి అడుగు ఏమిటి? అధికారం నిలుస్తుందా..? ఆధిపత్య పోరులో ఆవిరవుతుందా?



ముంచుకొస్తున్న యాంటీ ఇన్‌కంబెన్సీ ముప్పు!

- అధికార పార్టీలో పదవుల పంచాయితీలు
- బీఆర్ఎస్ విమర్శలు.. బీజేపీ అధికార వ్యూహాలు
- ఎల్‌నినోతో నీటి గండం.. పెరుగుతున్న ధరలు
- అధికారంలో కాంగ్రెస్.. అంతర్గతంగా కల్లోలం!

◆ ఓవైపు సొంతింటి పోరు.. మరోవైపు ప్రతిపక్షాల దాడి
◆ రేవంత్ నాయకత్వానికి అసలైన పరీక్ష

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావొస్తోండటంతో రాజకీయంగా సవాళ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఒకవైపు సొంత పార్టీలో పదవుల కోసం నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తుంటే, మరోవైపు బీఆర్ఎస్ తిరిగి పుంజుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇంకోవైపు బీజేపీ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా రాజకీయ దూకుడు పెంచుతోంది. వీటన్నింటికీ తోడు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయనే ఆందోళనలు, సాగు నీరు, తాగునీటి లభ్యతపై అనుమానాలు ప్రభుత్వానికి కొత్త తలనొప్పిగా మారుతున్నాయి. ఇప్పటికే బియ్యం ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుల బడ్జెట్‌ను దెబ్బతీస్తున్నాయి. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలు, పట్టణ సమస్యలు చర్చనీయాంశమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలకు భరోసా కల్పించడంతోపాటు రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇప్పుడు పాలనాపరమైన పరీక్షతోపాటు రాజకీయ నాయకత్వ పరీక్ష కూడా ఎదురవుతోంది. కాంగ్రెస్‌లో పదవుల కోసం కుమ్ములాటలు, ప్రతిపక్షాల నుంచి రాజకీయ దాడులు, ప్రజల్లో పెరుగుతున్న సమస్యలు ఒకేసారి చుట్టుముట్టడం అధికార పార్టీకి ఇబ్బందికరంగా మారింది. మంత్రివర్గ విస్తరణపై ఆశలు పెట్టుకున్న ఆశావహులకు ఇంకా స్పష్టత రాకపోవడం అసంతృప్తిని పెంచుతోంది. పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు దక్కడం లేదనే భావన కొందరు నేతల్లో బలపడుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన సమయంలోనే నాయకుల మధ్య విభేదాలు బయటపడటం అధిష్ఠానానికి కూడా ఆందోళన కలిగించే అంశం. ఇప్పటివరకు ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను రాజకీయంగా ఎదుర్కొన్న కాంగ్రెస్‌కు ఇకపై సొంతింటి సమస్యలను కూడా పరిష్కరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయాలు, పార్టీ నాయకత్వం వ్యవహరించే తీరు, ప్రభుత్వ పథకాల అమలు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేయనున్నాయి.

పదవుల కోసం రోడ్డెక్కుతున్న నేతలు!

కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు కేవలం గుసగుసలకే పరిమితం కావడం లేదు. కీలక నేతల మధ్య బహిరంగంగా వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయనే వార్తలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయి. తాజాగా ఢిల్లీలో మంత్రి దామోదర రాజనర్సింహా, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య జరిగినట్లు ప్రచారంలోకి వచ్చిన వివాదం పార్టీలో కలకలం సృష్టించింది. డీసీసీ అధ్యక్షుల నియామకాలు, ఇతర సంస్థాగత పదవుల కేటాయింపుల విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లిన సమయంలో ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో హెచ్చరికలు రచ్చకు కారణమయ్యాయి. ఇదే సమయంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంత్రి శ్రీధర్‌బాబుకు రాసిన లేఖ మరో రాజకీయ చర్చకు దారితీసింది. ఢిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన సభకు హాజరుకాని ఎమ్మెల్యేలు మక్కాకెసింగ్, విజయ రమణారావులపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవద్దని ఆయన కోరారు. గతంలో విశాఖ ట్రస్టు కార్యక్రమానికి హాజరైనందుకు గిరిజన మహిళా ప్రజాప్రతినిధితోపాటు కొందరు కార్యకర్తలపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్న తీరును ప్రస్తావించారు. వ్యక్తిగత విశ్వాసాలు, మతపరమైన కార్యక్రమాలకు హాజరుకావడాన్ని తప్పుగా చూడకూడదని పేర్కొంటూనే, ఢిల్లీ సభకు రాకపోవడాన్ని మరింత తీవ్రమైన తప్పుగా పరిగణించాలా, వద్దా అని ప్రశ్నించారు. మరోవైపు మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్ అంటూ ఎంపీ గడ్డం వంశీకృష్ణకు మంథని కాంగ్రెస్ నేతలు బహిరంగ హెచ్చరిక జారీ చేశారు. మంత్రి రాసిన లేఖపై ఎంపీ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, పార్టీ నాయకత్వంపై గౌరవంతో వ్యవహరించాలని హితవు పలికారు. స్థానిక కాంగ్రెస్ నేతలకు సమాచారం ఇవ్వకుండా మంథనిలో పర్యటించడం ఏమిటని ప్రశ్నిస్తూ, ఎంపీ వ్యవహారశైలిపై రాహుల్ గాంధీకి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్న విషయాన్ని వంశీకృష్ణ గుర్తించాలని హెచ్చరించారు. ఒకవైపు మంత్రి, ఎమ్మెల్యే మధ్య విభేదాలు.. మరోవైపు ఎంపీ లేఖాస్త్రం.. ఇంకోవైపు పదవుల కోసం ఎదురుచూస్తున్న ఆశావహులు కాంగ్రెస్‌లో పరిస్థితిని స్పష్టం చేస్తున్నాయి. ఈ విభేదాలను సకాలంలో పరిష్కరించకపోతే జిల్లా స్థాయిలో పార్టీ కార్యకలాపాలపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.



• కేటీఆర్, హరీశ్ రావు గురి.. రేవంత్‌పై దాడి!

కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలు చర్చనీయాంశంగా మారుతున్న సమయంలో బీఆర్ఎస్ తన రాజకీయ వ్యూహానికి పదును పెడుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేటీఆర్, హరీశ్ రావు వేర్వేరు పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం. సంస్థాగత పదవుల పంపకమే అధికార పార్టీలో ఆధిపత్య పోరుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. వాగ్వాదం

గ్రేటర్ ఎన్నికలే అసలు రాజకీయ అగ్నిపరీక్ష!

తెలంగాణలో రాబోయే రాజకీయ పరిణామాలకు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు కీలక మలుపుగా మారే అవకాశం ఉంది. జనవరిలో ఎన్నికలు జరిగే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నప్పటికీ, అధికారిక ఎన్నికల షెడ్యూల్ వెలువడే వరకు తేదీలపై స్పష్టత ఉండదు. గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ తన పట్టును పెంచుకోవాలని చూస్తుంటే, బీఆర్ఎస్ గతంలో ఉన్న పట్టును తిరిగి సాధించేందుకు ప్రయత్నించనుంది. బీజేపీ కూడా హైదరాబాద్‌ను తన రాజకీయ బలప్రదర్శనకు వేదికగా మార్చుకోవాలని భావిస్తోంది. నగరంలో రహదారులు, డ్రైనేజీ, వరదలు, తాగునీరు, చెత్త నిర్వహణ, ట్రాఫిక్, మౌలిక సదుపాయాలు ప్రధాన ఎన్నికల అంశాలుగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే తాగునీటి సమస్య ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, నగర అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలు ప్రజల ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పాలనను ప్రశ్నించనుంది. బీజేపీ కేంద్ర పథకాలు, అవినీతి ఆరోపణలు, స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ తన బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేయవచ్చు. అయితే గ్రేటర్ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ తన అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. మంత్రివర్గ విస్తరణపై నెలకొన్న ఉత్కంఠ, నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న నేతల అసంతృప్తి, డీసీసీ నియామకాలపై వివాదాలు ఎన్నికల సమయంలో పార్టీకి ఇబ్బందిగా మారవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరినీ కలుపుకొని వెళ్లగలరా? అసంతృప్తి నేతలకు సముచిత ప్రాధాన్యం కల్పించగలరా? మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం తీసుకుంటారా? అనే ప్రశ్నలు కాంగ్రెస్‌లో వినిపిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ తన నాయకత్వాన్ని బలోపేతం చేసుకుని ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందా? బీజేపీ అమిత్ షా ప్రకటించిన లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో బలం పెంచుకుంటుందా? అన్నది చూడాలి. రేవంత్ రెడ్డికి ఒకేసారి మూడు పరీక్షలు ఎదురుకానున్నాయి. మొదటిది సొంత పార్టీలో ఐక్యతను కాపాడుకోవడం. రెండోది బీఆర్ఎస్, బీజేపీ రాజకీయ దాడులను సమర్థంగా ఎదుర్కోవడం. మూడోది నీరు, వ్యవసాయం, ధరలు, పట్టణ సమస్యలపై ప్రజలకు కనిపించే పరిష్కారాలు అందించడం. కేవలం ప్రతిపక్షాల విమర్శలకు సమాధానాలు చెప్పడం ద్వారా ప్రభుత్వంపై విశ్వాసం పెరగదు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం, పాలనలో పారదర్శకత చూపించడం, నేతల మధ్య సమన్వయం సాధించడం అవసరం. కాంగ్రెస్‌కు ఇప్పుడు అసలు సవాలు ప్రతిపక్షాలను ఓడించడం మాత్రమే కాదు.. సొంతింటిని చక్కదిద్దుకుంటూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం. రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి వేసే రాజకీయ అడుగులు తెలంగాణ అధికార రాజకీయాల దిశను నిర్ణయించనున్నాయి.

అంశాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు జరిగిందనే ప్రశ్నను బీఆర్ఎస్ ముందుకు తెస్తోంది. రైతుల సమస్యలు, సాగునీటి లభ్యత, విద్యుత్ సరఫరా, సంక్షేమ పథకాలు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తోంది. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గితే రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొనే పరిస్థితులను రాజకీయంగా ప్రధాన అంశంగా మార్చేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించే అవకాశం ఉంది. కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు ప్రభుత్వానికి ముందస్తు హెచ్చరికగా మారుతున్నాయి. వర్షాలు తగ్గడం సహజ వాతావరణ పరిణామమైనప్పటికీ, నీటి నిర్వహణ, ప్రాజెక్టుల పరిస్థితి, రైతులకు ముందస్తు ప్రణాళికలు కల్పించడం ప్రభుత్వ బాధ్యతేనని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. కేటీఆర్ ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నిస్తూ రాజకీయంగా దూకుడు ప్రదర్శిస్తుంటే, హరీశ్ రావు సాగునీరు, రైతాంగం, ప్రాజెక్టుల అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనను కాంగ్రెస్ ప్రస్తావిస్తుండగా, ప్రస్తుత ప్రభుత్వ హామీలను అమలు చేయలేకపోతున్నదంటూ గులాబీ పార్టీ ఎదురుదాడి చేస్తోంది. ఈ విమర్శల మధ్య రేవంత్ రెడ్డి కూడా మౌనంగా ఉండే పరిస్థితి లేదు. గత ప్రభుత్వ నిర్ణయాలు, ఆర్థిక పరిస్థితి, ప్రాజెక్టుల నిర్వహణ, అవినీతి ఆరోపణలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ తన వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. అయితే రాజకీయ విమర్శలకంటే ప్రజలకు కనిపించే ఫలితాలే కీలకంగా మారనున్నాయి. రైతులకు నీటి భరోసా, పంటలకు మద్దతు, సంక్షేమ పథకాల అమలు, ఉద్యోగాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన పురోగతి చూపించాల్సి ఉంటుంది. బీఆర్ఎస్‌కు కూడా ఇదే సమయంలో రాజకీయంగా పునరుజ్జీవనం పొందే అవకాశం కనిపిస్తోంది. గత పాలనపై ఉన్న విమర్శలను అధిగమించి, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితేనే ఆ పార్టీకి రాజకీయంగా ప్రయోజనం ఉంటుంది. కేటీఆర్, హరీశ్ రావుల దూకుడుకు రేవంత్ ఎలా సమాధానం చెబుతారన్నది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

• ఎల్‌నినో ముప్పు.. నీటి కోసం ముందస్తు పరీక్ష!

రాజకీయ పరిణామాలన్నింటికంటే తెలంగాణ ప్రజలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే అంశం నీటి సమస్య. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే వర్షాకాలంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉందనే అంచనాలు వ్యవసాయ రంగంతోపాటు పట్టణ ప్రాంతాల్లోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుంది? వర్షాలు ఎక్కడ, ఎంత మేరకు తగ్గుతాయి? జలాశయాల్లో నీటి నిల్వలు ఎలా ఉంటాయి? అనే ప్రశ్నలకు వాతావరణ శాఖ అంచనాలు, జలవనరుల శాఖ లెక్కలు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే మొదటగా ఇబ్బందులు ఎదుర్కొనేది రైతాంగమే. సాగునీటి ప్రాజెక్టులపై ఆధారపడిన ప్రాంతాల్లో నీటి విడుదల కీలకంగా మారుతుంది. ఇప్పటికే సాగు పెట్టుబడులు, విత్తనాలు, ఎరువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు నీటి కొరత మరో భారంగా మారవచ్చు. సాగునీరు సంగతి పక్కనపెడితే కనీసం తాగునీరు అందుతుందా? అన్న ప్రశ్న కూడా ప్రజల్లో మొదలవుతోంది. హైదరాబాద్‌తోపాటు ఇతర పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో వేసవి అవసరాలకు అనుగుణంగా నీటి నిల్వలు, సరఫరా వ్యవస్థలను ప్రభుత్వం సిద్ధం చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా హైదరాబాద్ జనాభా పెరుగుదల, విస్తరిస్తున్న నివాస ప్రాంతాలు, పారిశ్రామిక అవసరాలు నీటి డిమాండ్‌ను పెంచుతున్నాయి. జలాశయాల్లో నిల్వలు తగ్గితే సరఫరాపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తే సామాన్య కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. మరోవైపు ఎల్‌నినో ప్రభావం రాకముందే బియ్యం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు కూడా సామాన్యులకు భారంగా మారుతున్నాయి. ఆహార ధాన్యాల సరఫరా, నిల్వలు, మార్కెట్ ధరలపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. వర్షాలు తగ్గుతాయనే అంచనాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో పండే పంటలు, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల సంరక్షణపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలి. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సంబంధించి జలాశయాల నిల్వలు, సరఫరా మార్గాలు, అత్యవసర ప్రణాళికలను ప్రజలకు వెల్లడించాలి. నీటి సమస్య తీవ్రత పెరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవడం ముఖ్యం. ఇక్కడే రేవంత్ ప్రభుత్వానికి పాలనా సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం ఉంది. వర్షాభావ పరిస్థితులను రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితం చేయకుండా ప్రజలకు భరోసా కల్పించే చర్యలు చేపట్టాలి. నీరు, బియ్యం, నిత్యావసర ధరలు.. ఈ మూడు అంశాలే రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే అవకాశముంది.

తెలంగాణలో అధికారం మాదే.. అమిత్ షా యుద్ధ ప్రకటన!

బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై దాడిని తీవ్రతరం చేస్తోంది. తెలంగాణలో అధికారం సాధించడమే తమ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ కార్యక్రమాల్లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను కాంగ్రెస్ అధిష్ఠానానికి ఏటీఎంగా మార్చారని ఆరోపించారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపైనా ఆరోపణలు చేస్తూ రాష్ట్రంలో అవినీతిని అడ్డుకునే శక్తి బీజేపీకే ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను రాజకీయంగా ఓడించి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని అమిత్ షా స్పష్టం చేయడం రాష్ట్రంలో ఆ పార్టీ భవిష్యత్ కార్యాచరణకు సంకేతంగా కనిపిస్తోంది. మరోవైపు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు కూడా ఆయన గట్టిగా సమాధానం ఇచ్చారు. రాహుల్ గాంధీ ప్రస్తావించిన 13 కోట్ల ఓట్ల తొలగింపు అంశాన్ని ప్రశ్నిస్తూ, అందులో డూప్లికేట్ ఓట్లు, మరణించిన వ్యక్తుల పేర్లు, రెండు ప్రాంతాల్లో నమోదైన ఓట్లు ఉన్నాయని వివరించారు. అలాంటి పేర్లను తొలగించకూడదా? ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు వేసే అవకాశం ఇవ్వాలా? అని కాంగ్రెస్‌ను నిలదీశారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నది బీజేపీ విధానమని స్పష్టం చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ నిర్వహించిన ఓటు బచావో ర్యాలీని చొరబాటుదారులను కాపాడే కార్యక్రమంగా అభివర్ణించారు. ఈ ఆరోపణలకు కాంగ్రెస్ నుంచి రాజకీయ ప్రతిస్పందన వస్తోంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిజమైన ఓటర్లకు అన్యాయం జరగకూడదని, ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని కాంగ్రెస్ వాదిస్తోంది. మరోవైపు రాహుల్ గాంధీ నిర్వహించిన మాక్ పార్లమెంట్‌పై అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నిజమైన పార్లమెంట్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈవీఎంలు, ఓట్ల చోరీ, ఎస్ఐఆర్ అంశాలపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ప్రజల తీర్పుగా, ఓడిపోయినప్పుడు ఈవీఎంల తప్పిదంగా చెప్పడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్‌పై దాడి చేస్తూనే తెలంగాణలో అధికార సాధనకు అమిత్ షా బహిరంగంగా వ్యూహాన్ని ప్రకటించడం రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే ప్రయత్నంగా కనిపిస్తోంది. అయితే ఆ లక్ష్యం సాధించాలంటే కేవలం కేంద్ర నాయకుల ప్రకటనలు సరిపోవు. రాష్ట్ర స్థాయిలో బలమైన నాయకత్వం, క్షేత్రస్థాయి పోరాటం, ప్రజల్లో విశ్వాసం అవసరం.







మున్సిపల్ ఎన్నికల్లో కూటమి జయకేతనం

మున్సిపల్, కార్పొరేషన్లలో కూటమి క్లీన్‌స్వీప్

వైసీపీకి షాక్.. చంద్రబాబు వ్యూహానికి ప్రజామోదం!

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి అధికార కూటమి బలాన్ని చాటుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన, బీజేపీ కలిసి పోటీ చేసిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆధిక్యం ప్రదర్శించాయి. వెలువడుతున్న లెక్కింపు ధోరణుల ప్రకారం రాష్ట్రంలోని మొత్తం అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలోనూ ఎన్డీయే కూటమి ఆధిక్యంలో నిలిచింది. 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలతో కలిపి మొత్తం 92 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ సాగింది. మొత్తం 3,186 వార్డులకు 138 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టారు. నవంబర్ 1న జరిగిన పోలింగ్‌లో 62.16 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 96,89,061 మంది ఓటర్లలో 60,22,411 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2021లో జరిగిన గత మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి అధికార వైసీపీ రాష్ట్రంలోని మొత్తం 13 కార్పొరేషన్లలో మేయర్ స్థానాలను గెలుచుకుంది. ఇప్పుడు అదే 13 కార్పొరేషన్లలో కూటమి ఆధిక్యం సాధించడం రాజకీయంగా కీలక పరిణామంగా మారింది. ముఖ్యంగా 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఎదుర్కొన్న పరాజయం తర్వాత పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలం ఎంతవరకు నిలిచిందనే ప్రశ్నకు ఈ ఎన్నికలు సమాధానం చెబుతున్నాయి. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే కొద్దీ వార్డుల వారీగా పూర్తి ఫలితాలు స్పష్టమవుతాయి. అయినప్పటికీ పట్టణ ఓటరు తీర్పు కూటమికి అనుకూలంగా ఉందనే రాజకీయ సంకేతం మాత్రం బలంగా కనిపిస్తోంది. వైసీపీ 2021లో సాధించిన పట్టణ ఆధిపత్యాన్ని కూటమి ఇప్పుడు సవాలు చేస్తోంది.

• చంద్రబాబు వ్యూహం.. టీడీపీ పట్టు నిలబెట్టుకున్న ప్రాంతాలు

ఈ ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు అనుసరించిన రాజకీయ వ్యూహం కూటమికి ప్రధాన బలంగా కనిపిస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని పట్టణ ప్రాంతాల్లోనూ కొనసాగించాలనే లక్ష్యంతో మూడు పార్టీల మధ్య స్థానాల పంపకం, స్థానిక నాయకుల సమన్వయం, అభ్యర్థుల ఎంపికపై కూటమి దృష్టి పెట్టింది. మేయర్ స్థానాల విషయంలో టీడీపీకి 10, జనసేనకు రెండు, బీజేపీకి ఒక కార్పొరేషన్ కేటాయించడం ద్వారా పోటీకి ముందే బాధ్యతలను విభజించుకుంది. మున్సిపాలిటీల్లో 70 చైర్‌పర్సన్ స్థానాలకు సంబంధించి టీడీపీ 49 చోట్ల, జనసేన 17 చోట్ల, బీజేపీ నాలుగు చోట్ల అభ్యర్థులను నిలిపాయి. మరో 17 స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరు ప్రాంతంలో ఏకగ్రీవ విజయాలు కూటమికి ముందుగానే ఆధిక్యాన్ని అందించాయి. ముఖ్యంగా పుంగనూరులో 36 వార్డులకు 32 స్థానాలు ఏకగ్రీవం కాగా, టీడీపీ 27 స్థానాలు, జనసేన రెండు, బీజేపీ రెండు స్థానాలు దక్కించుకున్నాయి. ఒక స్వతంత్ర అభ్యర్థి కూడా కూటమికి మద్దతుగా నిలిచారు. రాయచోటిలో మొత్తం 44 వార్డులతో పాటు చైర్‌పర్సన్ స్థానం ఏకగ్రీవమైంది. నగరిలోనూ చైర్‌పర్సన్ స్థానం ఏకగ్రీవంగా కూటమి ఖాతాలో పడింది. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పంలో 32 వార్డులన్నింటినీ కూటమి గెలుచుకుంది. మాచర్లలో 36 వార్డులన్నీ కూటమి ఖాతాలో చేరగా, ఏలూరు, యమ్మిగనూరు, నరసాపురం, పలాసకాశీబుగ్గ వంటి ప్రాంతాల్లోనూ కూటమి ఆధిక్యం సాధించింది. పులివెందుల వంటి వైసీపీకి బలమైన ప్రాంతంలోనూ టీడీపీ గట్టి పోటీ ఇచ్చింది. అక్కడ 40 వార్డుల్లో 20 స్థానాలు టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. చైర్‌పర్సన్ పోటీలో టీడీపీ అభ్యర్థి టీ. గీతాకుమారి, వైసీపీ అభ్యర్థి వై.ఎస్. ప్రమీలమ్మపై రెండు రౌండ్ల అనంతరం 6,325 ఓట్ల ఆధిక్యంలో నిలిచారు. ఈ పరిణామం రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఎందుకంటే పులివెందుల దశాబ్దాలుగా వైఎస్ కుటుంబానికి రాజకీయంగా కంచుకోటగా ఉంది. అయితే ఏకగ్రీవ స్థానాలు, ప్రత్యక్ష పోటీలో వచ్చిన విజయాలు రెండింటినీ విడివిడిగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. కుప్పం, మాచర్ల, పులివెందుల ఫలితాలు కూటమి రాజకీయ బలానికి కీలక సంకేతాలుగా మారాయి.

• చంద్రబాబు స్పందన.. సుపరిపాలనకు ప్రజల మద్దతు

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఆధిక్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. ప్రజలు తమ ప్రభుత్వ పనితీరును గమనించి తీర్పు ఇచ్చారని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం రాజకీయ ప్రచారం ఆధారంగా కాకుండా ప్రజలకు అందిస్తున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చూపుతున్న చొరవను ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. తనకు రాజకీయాల కంటే ప్రజల సమస్యల పరిష్కారమే ముఖ్యమని స్పష్టం చేశారు. గుడ్ పాలిటిక్స్, గుడ్ గవర్నెన్స్ తన పాలనా ప్రాధాన్యతలని వెల్లడించారు. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల అభివృద్ధి వంటి కార్యక్రమాలను ప్రభుత్వం వేగవంతం చేస్తోందని వివరించారు. గత పాలనలో దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి మెరుగుపరచడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అన్ని పనులు పూర్తయ్యాయని చెప్పడం లేదని, వారసత్వంగా వచ్చిన సమస్యలు ఇంకా ఉన్నాయని అంగీకరిస్తూనే వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు సేవలందించే విషయంలో ఏమైనా లోపాలు ఉంటే సరిదిద్దుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వసనీయత పెరిగిందని, అందుకే స్థానిక ఎన్నికల్లోనూ మద్దతు లభించిందని చంద్రబాబు విశ్లేషించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మురసు తుపాను కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని తెలిపారు. గత మూడు రోజులుగా తుపాను సహాయక చర్యలపైనే రాత్రింబవళ్లు పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రజల ప్రాణాలను కాపాడటం, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడం ప్రభుత్వానికి ముఖ్యమని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను తమ పాలనకు ప్రజలు ఇచ్చిన గుర్తింపుగా చంద్రబాబు భావిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సుపరిపాలన తమ విజయానికి కారణమని చంద్రబాబు చెబుతున్నారు.

• జనసేన దూకుడు.. పవన్ కళ్యాణ్‌కు పట్టణాల్లో బలం

ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ ప్రదర్శన కూడా కూటమి విజయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జనసేనకు రెండు మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ స్థానాలు కేటాయించగా, మున్సిపాలిటీల్లో 17 చైర్‌పర్సన్ స్థానాల్లో పోటీ చేసే అవకాశం లభించింది. పట్టణ ప్రాంతాల్లో పార్టీకి ఉన్న కొత్త రాజకీయ గుర్తింపును స్థానిక ఎన్నికల ద్వారా మరింత విస్తరించుకోవాలని జనసేన ప్రయత్నించింది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో పార్టీ అభ్యర్థులు ఆధిక్యం ప్రదర్శించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. లెక్కింపు ప్రారంభమైన తొలిదశలోనే తొమ్మిది వార్డుల్లో జనసేన ఐదు చోట్ల ఆధిక్యంలో ఉండగా, స్వతంత్రులు మూడు చోట్ల, టీడీపీ ఒక చోట ముందంజలో నిలిచాయి. కాకినాడ జిల్లా పెద్దాపురంలో మొదట ప్రకటించిన ఎనిమిది వార్డుల ఫలితాల్లో జనసేన నాలుగు, టీడీపీ రెండు, బీజేపీ ఒక స్థానం గెలుచుకున్నాయి. వైసీపీ ఒక స్థానంతో సరిపెట్టుకుంది. విశాఖపట్నం మహా నగరపాలక సంస్థ పరిధిలోనూ జనసేన తన ఉనికిని చాటుకుంది. పశ్చిమ జోన్‌లోని 75వ వార్డులో జనసేన అభ్యర్థి అంగ సౌందర్య రాణి విజయం సాధించారు. 43వ వార్డులో జనసేన అభ్యర్థి కే. నళినీదేవి గెలుపొందారు. విశాఖలో జనసేన కార్యకర్తలు విజయోత్సవాలు నిర్వహించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచింది. జనసేనకు కేటాయించిన కార్పొరేషన్ స్థానాల్లో రెండు చోట్ల పోటీ చేయడం, మున్సిపాలిటీల్లో 17 స్థానాల్లో అభ్యర్థులను నిలపడం ద్వారా పార్టీ తన రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచుకునే ప్రయత్నం చేసింది. పిఠాపురం వంటి ప్రాంతాల్లో కనిపించిన ఆధిక్యం ఆ దిశగా సానుకూల సంకేతాలను ఇచ్చింది. కూటమిలో టీడీపీ ప్రధాన రాజకీయ శక్తిగా కొనసాగుతున్నప్పటికీ జనసేనకు లభించిన స్థానాలు భవిష్యత్తులో స్థానిక రాజకీయాల్లో ఆ పార్టీ పాత్రను పెంచే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలు వేదికగా మారాయి. పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేస్తే రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేనకు మరిన్ని అవకాశాలు లభిస్తాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. పిఠాపురం, విశాఖ ఫలితాలు జనసేనకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి.

• బీజేపీకి ప్రాతినిధ్యం.. కూటమి ఐక్యతకు పరీక్ష

ఎన్డీయే కూటమిలో మరో భాగస్వామి అయిన భారతీయ జనతా పార్టీ కూడా ఈ మున్సిపల్ ఎన్నికల్లో తన ప్రాతినిధ్యాన్ని పెంచుకునే ప్రయత్నం చేసింది. 13 కార్పొరేషన్లలో ఒక మేయర్ స్థానాన్ని, మున్సిపాలిటీల్లో నాలుగు చైర్‌పర్సన్ స్థానాలను బీజేపీకి కేటాయించారు. పుంగనూరులో రెండు వార్డులను గెలుచుకోవడం, పెద్దాపురంలో ఒక వార్డును దక్కించుకోవడం పార్టీకి లభించిన విజయాల్లో ముఖ్యమైనవి. పట్టణ ప్రాంతాల్లో పార్టీకి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకును కాపాడుకోవడంతో పాటు టీడీపీ, జనసేనతో కలిసి పోటీ చేయడం ద్వారా మరింత విస్తృతమైన రాజకీయ ప్రాతినిధ్యం సాధించాలని బీజేపీ భావించింది. స్థానాల పంపకంలో పరిమిత అవకాశాలే లభించినప్పటికీ కూటమి విజయంలో భాగస్వామిగా నిలవడం పార్టీకి రాజకీయంగా ఉపయోగపడనుంది. బీజేపీ పోటీ చేసిన స్థానాల్లో వచ్చిన విజయాలు, కూటమి అభ్యర్థుల సమష్టి ఆధిక్యం ఆ పార్టీకి సానుకూల పరిణామాలుగా మారాయి. మూడు పార్టీల మధ్య ఎన్నికల సమన్వయం కొనసాగితే భవిష్యత్తులో స్థానిక సంస్థల్లో పాలనా బాధ్యతలను పంచుకునే అవకాశం ఉంటుంది. అదే సమయంలో సీట్ల పంపకం తర్వాత క్షేత్రస్థాయి నాయకుల మధ్య ఏర్పడే అసంతృప్తిని పరిష్కరించడం కూడా కూటమికి అవసరం. స్థానిక ఎన్నికల్లో వ్యక్తిగత నాయకుల ప్రభావం, సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలు కీలకంగా ఉంటాయి. అందువల్ల అసెంబ్లీ స్థాయిలో ఉన్న కూటమి బలాన్ని వార్డు స్థాయికి తీసుకెళ్లడం సులభమైన పని కాదు. ఈ ఎన్నికల్లో మూడు పార్టీల కార్యకర్తలు కలిసి పనిచేసిన ప్రాంతాల్లో కూటమికి మెరుగైన ఫలితాలు కనిపించాయి. బీజేపీకి వచ్చిన ప్రాతినిధ్యం కూటమిలో ఆ పార్టీ రాజకీయ స్థాయిని మరింత బలోపేతం చేసే అవకాశం ఉంది. టీడీపీ ప్రధాన బలంగా నిలవగా జనసేన, బీజేపీ విజయాలు కూటమికి అదనపు బలాన్నిచ్చాయి.

• వైసీపీ ఆగ్రహం.. ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు

మరోవైపు మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సంఘం తీరును తప్పుబడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్ర ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తోందని ఆరోపించారు. పోలింగ్ సమయంలో వైసీపీ ఏజెంట్లను అడ్డుకున్నారని, అధికారుల సహకారంతో టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయని ఆయన విమర్శించారు. ముఖ్యంగా పులివెందులలో 80 పోలింగ్ కేంద్రాలకు గాను 70 కేంద్రాల్లో తమ ఏజెంట్లను అనుమతించలేదని జగన్ ఆరోపించారు. కొన్నిచోట్ల ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపించారని, ఓటర్ల నుంచి స్లిప్పులు లాక్కున్నారని, పోలింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకుని అక్రమంగా ఓట్లు వేశారని పేర్కొన్నారు. ఈ ఘటనలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని చెబుతూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసినట్లు వివరించారు. పులివెందులలో అనేక కేంద్రాల్లో అక్రమాలు జరిగాయని తమ పార్టీ ఆరోపిస్తుంటే కేవలం నాలుగు కేంద్రాల్లో మాత్రమే రీపోలింగ్ నిర్వహించడంపై జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కడప, అనంతపురం, తిరుపతి, కర్నూలు, చిత్తూరు, ఒంగోలు, గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం, విజయవాడ కార్పొరేషన్లతో పాటు పలు మున్సిపాలిటీల్లోనూ అక్రమాలు జరిగాయని వైసీపీ ఆరోపించింది. ఎన్నికల నిర్వహణపై న్యాయపోరాటం చేస్తామని జగన్ స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. పులివెందులలో జరిగిన పరిణామాలపై జగన్ ఎన్నికల రోజునే నిరసనకు దిగారు. ఆరోపణలకు నిరసనగా తాను ఓటు వేయబోనని ప్రకటించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. అయితే పులివెందులలో రీపోలింగ్ కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు తిరస్కరించడంతో ఓట్ల లెక్కింపునకు మార్గం సుగమమైంది.

• వర్షం, వివాదాలు.. లెక్కింపులో కీలక పరిణామాలు

ఈ ఎన్నికల ఫలితాల ప్రక్రియ అనేక ఆసక్తికర పరిణామాల మధ్య కొనసాగింది. మురసు తుపాను ప్రభావంతో విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాతో పాటు ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో ఓట్ల లెక్కింపునకు ఆటంకం ఏర్పడింది. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సిన లెక్కింపు మధ్యాహ్నం 11.30 గంటలకు వాయిదా పడింది. విజయవాడలోనూ సోమవారం అర్ధరాత్రి నుంచి వర్షాలు, బలమైన గాలులు కొనసాగడంతో సిబ్బంది రాక ఆలస్యమైంది. మధ్యాహ్నం వరకు కొన్ని వార్డుల్లో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపే పూర్తయింది. నెల్లూరులో తొలి రౌండ్‌కు సుమారు 90 నిమిషాలు పట్టగా, తర్వాతి రౌండ్లను గంటలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మరోవైపు పార్వతీపురంలో స్ట్రాంగ్ రూమ్ తాళాలు కనిపించకపోవడంతో లెక్కింపు దాదాపు రెండు గంటలు ఆలస్యమైంది. అన్ని రాజకీయ పార్టీల సమ్మతితో తాళాలు పగులగొట్టి లెక్కింపు ప్రారంభించారు. తాళాలు భద్రపరచడంలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఎన్నికల సిబ్బందిని ఎస్ఈసీ సస్పెండ్ చేసింది. కుప్పంలోనూ లెక్కింపు ధోరణులపై టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ పరిణామాలు ఎన్నికల నిర్వహణపై రాజకీయ విమర్శలకు మరింత అవకాశం కల్పించాయి. అయితే వర్షాలు, సాంకేతిక ఇబ్బందులు, కొన్ని కేంద్రాల్లో తలెత్తిన వివాదాలు ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా లెక్కింపు కొనసాగింది.

పట్టణ తీర్పు.. రాబోయే రాజకీయాలకు దిశానిర్దేశం

మొత్తంగా చూస్తే ఏపీ మున్సిపల్ ఎన్నికలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి రాజకీయంగా పెద్ద ఊరటనిచ్చాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా పట్టణ ప్రాంతాల్లో తమకు ప్రజల మద్దతు కొనసాగుతోందని నిరూపించుకునే అవకాశం అధికార కూటమికి లభించింది. 2021లో మొత్తం 13 కార్పొరేషన్లను గెలుచుకున్న వైసీపీ ఇప్పుడు, పూర్తి స్థాయిలో చతికిలపడటం ఆ పార్టీకి ఆత్మపరిశీలన అవసరాన్ని సూచిస్తోంది. అయితే ఎన్నికల నిర్వహణపై వైసీపీ చేసిన ఆరోపణలను విస్మరించలేం. వాటిపై సమగ్ర విచారణ జరగాలన్న డిమాండ్ ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన అంశం. మరోవైపు కూటమి సాధించిన విజయాన్ని కేవలం వైసీపీ వ్యతిరేక ఓటుగా మాత్రమే చూడలేం. పట్టణాల్లో స్థానిక సమస్యలు, అభివృద్ధిపై ఆశలు, ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయం, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం కూడా ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేసి ఉంటాయి. ముఖ్యంగా కుప్పం, మాచర్ల, పులివెందుల వంటి రాజకీయ ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో వచ్చిన ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. విశాఖ, నెల్లూరు, తిరుపతి వంటి పెద్ద నగరాల్లో టీడీపీ అభ్యర్థులు సాధించిన ఆధిక్యం కూటమికి మరింత ఉత్సాహాన్నిచ్చింది. జనసేనకు లభించిన విజయాలు పవన్ కళ్యాణ్ పార్టీ పట్టణాల్లోనూ విస్తరించే అవకాశాన్ని చూపిస్తున్నాయి. బీజేపీకి వచ్చిన స్థానాలు కూటమిలో ఆ పార్టీ పాత్రను నిలబెట్టాయి. అయితే ఈ విజయాన్ని నిలబెట్టుకోవడం కూటమికి అసలు సవాలు. మున్సిపాలిటీల్లో పాలకవర్గాలు ఏర్పడిన తర్వాత తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, పన్నుల భారం, పట్టణ ప్రణాళిక వంటి సమస్యల పరిష్కారంపై ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఈరోజు వచ్చిన ఆధిక్యం రేపు అసంతృప్తిగా మారే ప్రమాదం ఉంది. వైసీపీకి కూడా ఈ ఫలితాలు కీలకమైన రాజకీయ పాఠాన్ని అందిస్తున్నాయి. కేవలం ఎన్నికల నిర్వహణపై విమర్శలు చేయడం ద్వారా పార్టీ తిరిగి బలపడలేదు. క్షేత్రస్థాయిలో నాయకత్వాన్ని పటిష్టం చేయడం, కార్యకర్తలకు భరోసా కల్పించడం, పట్టణ ఓటర్ల సమస్యలపై నిరంతరం పోరాడటం అవసరం. అదే సమయంలో జనసేన, బీజేపీలతో టీడీపీ కొనసాగించే సమన్వయం కూడా భవిష్యత్తు రాజకీయాల్లో కీలకం కానుంది. స్థానిక సంస్థల ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికల తుది తీర్పును నిర్ణయించకపోయినా, ప్రజల ప్రస్తుత రాజకీయ అభిప్రాయాన్ని అంచనా వేయడానికి ముఖ్యమైన సూచికగా నిలుస్తాయి.



అమెరికా రాజకీయాల్లో కీలక ఘట్టం మొదలైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మధ్యంతర ఎన్నికలు ఆయన రాజకీయ భవిష్యత్తుకు పరీక్షగా మారాయి. నాలుగేళ్ల పదవీకాలంలో సగం పూర్తవుతున్న వేళ జరుగుతున్న ఈ ఎన్నికలు కేవలం కాంగ్రెస్ సభ్యుల ఎంపిక మాత్రమే కాదు.. ట్రంప్ పాలనపై ప్రజల తీర్పుగా నిలుస్తున్నాయి. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఇంధన సంక్షోభం, ఇరాన్‌తో యుద్ధ పరిణామాలు ఓటర్లను ప్రభావితం చేస్తున్నాయి. రిపబ్లికన్లు ట్రంప్ నాయకత్వాన్ని సమర్థిస్తుండగా, డెమొక్రాట్లు ఆయన పాలనలోని వైఫల్యాలను ప్రచారాస్త్రాలుగా మలుచుకున్నారు. అధ్యక్షుడి పేరు బ్యాలెట్‌పై లేకపోయినా, పోటీ మాత్రం ట్రంప్ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య సాగుతోంది. డెమొక్రాట్లు ప్రతినిధుల సభ లేదా సెనేట్‌ను గెలుచుకుంటే ట్రంప్ ప్రభుత్వానికి కాంగ్రెస్‌లో అడ్డంకులు ఎదురవుతాయి. ఆయన ప్రతిపాదించే చట్టాలను నిలువరించడంతోపాటు ప్రభుత్వ నిర్ణయాలపై విచారణలు చేపట్టే అవకాశం ఉంటుంది. సాధారణంగా అధికార పార్టీ మధ్యంతర ఎన్నికల్లో సీట్లు కోల్పోవడం ఆనవాయితీ. అదే జరిగితే ట్రంప్ మిగిలిన రెండేళ్ల పాలన మరింత రాజకీయ ఒత్తిడిలో సాగుతుంది. రిపబ్లికన్లు మెజారిటీ నిలబెట్టుకుంటే మాత్రం 2028 వరకు ట్రంప్ తన విధానాలను సులభంగా అమలు చేసుకోవచ్చు. అందుకే తాజా ఎన్నికలు అమెరికా అధికార సమతుల్యతను నిర్ణయించే కీలక పోరుగా మారాయి.

మిడ్ టర్మ్ ఎలక్షన్స్.. ట్రంప్‌కి ఎండ్ కార్డ్

రిపబ్లికన్లపై డెమొక్రాట్ల ఒబామా వైల్డ్ కార్డ్

- ట్రంప్ భవితవ్యాన్ని తేల్చనున్న అమెరికన్లు!
- ఎన్నికల్లో కోట్లు కుమ్మరిస్తున్న కుబేరుడు మస్క్
- అధ్యక్షుడు అర్ధంతరంగా వైదొలగాల్సి వస్తోందా?

435 స్థానాలు.. అధికారానికి అసలు పరీక్ష

అమెరికా కాంగ్రెస్‌లోని రెండు సభల భవిష్యత్తును ఈ ఎన్నికలు నిర్ణయించనున్నాయి. ప్రతినిధుల సభలోని 435 స్థానాలకు, సెనేట్‌లో 35 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, 36 రాష్ట్రాల్లో గవర్నర్ పదవులకూ పోటీ నెలకొంది. ప్రస్తుతం ప్రతినిధుల సభలో రిపబ్లికన్లకు 218 స్థానాలు, డెమొక్రాట్లకు 214 స్థానాలు ఉన్నాయి. ఒక స్వతంత్ర సభ్యుడు రిపబ్లికన్లకు మద్దతిస్తున్నాడు. మరో రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. డెమొక్రాట్లు కనీసం మూడు స్థానాలు అదనంగా గెలుచుకుంటే సభపై పట్టు సాధించే అవకాశం ఉంది. సెనేట్‌లో రిపబ్లికన్లకు 53 స్థానాలు ఉండగా, ఇద్దరు స్వతంత్ర సభ్యుల మద్దతుతో డెమొక్రాట్ల బలం 47గా ఉంది. సెనేట్‌ను చేజిక్కించుకోవాలంటే డెమొక్రాట్లు నాలుగు స్థానాల నికర అధిక్యం సాధించాలి. ఓట్లు సమానమైతే ఉపాధ్యక్షుడికి నిర్ణయాత్మక ఓటు వేసే అధికారం ఉంది. టెక్సాస్, ఒహాయో, నార్త్ కరోలినా, జార్జియా, మిషిగన్ రాష్ట్రాల ఫలితాలు సెనేట్ అధికార సమీకరణాలను ప్రభావితం చేయనున్నాయి. టెక్సాస్‌లో జేమ్స్ తలారికో, కెన్ పాక్స్టన్ మధ్య, ఒహాయోలో షెరాడ్ బ్రౌన్, మిషిగన్‌లో అబ్దుల్ ఎల్ సయీద్, మైక్ రోజర్స్ మధ్య పోటీ ఆసక్తి రేపుతోంది. జార్జియాలో జాన్ ఒసాఫ్ తన స్థానాన్ని నిలబెట్టుకోవాల్సి ఉంది. డెమొక్రాట్లు ఏ ఒక్క సభను గెలుచుకున్నా ట్రంప్ నిర్ణయాలపై పర్యవేక్షణ పెరుగుతుంది. రెండు సభలూ చేజిక్కించుకుంటే ఆయన ప్రభుత్వానికి కాంగ్రెస్‌లో గట్టి ప్రతిఘటన తప్పదు. రిపబ్లికన్ల ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం, డెమొక్రాట్లు తిరిగి అధికార పట్టు సాధించడం మధ్య ఈ ఎన్నికలు నిర్ణయాత్మక పోరుగా మారాయి.



ట్రంప్ ధీమా.. ఓటర్లపై ఒత్తిడి

ఎన్నికల ప్రచారంలో ట్రంప్ దూకుడు పెంచారు. తన పాలనలో అమెరికా బలపడిందని, దేశం స్వర్ణయుగం దిశగా సాగుతోందని చెబుతున్నారు. సుంకాల విధానం, వలసల నియంత్రణ, జాతీయ భద్రతలో సాధించిన విజయాలను వివరిస్తూ రిపబ్లికన్ అభ్యర్థులకు ఓటు వేయాలని పిలుపునిస్తున్నారు. గతంలో తనకు మద్దతిచ్చిన వారంతా ఈసారి కూడా ఓటు వేస్తే పార్టీ భారీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే మధ్యంతర ఎన్నికల్లో అధికార పార్టీ సీట్లు కోల్పోయే సంప్రదాయం తనకూ ఎదురుకావచ్చని ట్రంప్ అంగీకరిస్తున్నారు. అందుకే అక్టోబర్‌లోనే 20కి పైగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని కీలక రాష్ట్రాల్లో అభ్యర్థులకు మద్దతుగా పర్యటించారు. మరోవైపు ప్రజాదరణపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. రాయిటర్స్/ఇప్సోస్ సర్వేలో ట్రంప్ ఆమోద రేటింగ్ 32 శాతానికి పడిపోగా, కాంగ్రెస్ ఎన్నికల్లో డెమొక్రాట్లకు 46 శాతం, రిపబ్లికన్లకు 38 శాతం మద్దతు నమోదైంది. పెరుగుతున్న జీవన వ్యయం, చమురు ధరలు, ఇరాన్‌తో యుద్ధం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతున్నాయి. ట్రంప్ విధానాలపై ప్రజల అభిప్రాయం ఓట్ల రూపంలో వెల్లడికానుంది. అయితే సర్వేలు తుది ఫలితాలకు హామీ ఇవ్వవు. చివరి నిమిషంలో ఓటర్ల నిర్ణయమే కీలకం. ట్రంప్ ఆశిస్తున్న విజయం దక్కుతుందా? ప్రజల అసంతృప్తి రిపబ్లికన్ల స్థానాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

ఓటర్లలో ఉత్సాహం ఎటువైపు?

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం కీలకంగా మారింది. అధ్యక్ష ఎన్నికలతో పోలిస్తే మధ్యంతర ఎన్నికల్లో ప్రజల ఆసక్తి తక్కువగా ఉండటం సాధారణం. అయితే ఈసారి ఓటింగ్‌పై నిరాసక్తత కంటే ఏ పార్టీ మద్దతుదారులు ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు వస్తున్నారన్నదే చర్చనీయాంశమైంది. వాషింగ్టన్ పోస్ట్/ఏబీసీఇప్సోస్ సర్వే ప్రకారం డెమొక్రాట్లలో 75 శాతం మంది తప్పకుండా ఓటు వేస్తామని లేదా ఇప్పటికే వేశామని చెప్పగా, రిపబ్లికన్లలో ఈ సంఖ్య 67 శాతంగా ఉంది. మరోవైపు ఎన్నికలకు ముందే 5.7 కోట్ల మందికి పైగా ముందస్తు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అయితే వారు ఏ పార్టీకి మద్దతిచ్చారన్నది స్పష్టంగా తెలియదు. ఎన్నికల రోజున వర్షాలు, వరదలు కొన్నిప్రాంతాల్లో ఆటంకాలు సృష్టించాయి. ఫ్లోరిడాలో వరదల కారణంగా 19 పోలింగ్ కేంద్రాలను మార్చారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు దేశవ్యాప్తంగా సుమారు వెయ్యి మంది పరిశీలకులను నియమించినట్లు న్యాయశాఖ వెల్లడించింది. ధరల పెరుగుదలపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఓట్లుగా మార్చుకోవాలని డెమొక్రాట్లు ప్రయత్నిస్తుండగా, ట్రంప్ మద్దతుదారులను పోలింగ్ కేంద్రాలకు రప్పించడంపై రిపబ్లికన్లు దృష్టి పెట్టారు. ఈసారి ఎన్నికల్లో అసలు పరీక్ష ప్రజల నిరాసక్తత కాదు.. ఏ పార్టీ మద్దతుదారులు అధిక సంఖ్యలో ఓటు వేస్తారన్నదే.

మస్క్ రంగప్రవేశం.. రూ.3,472 కోట్ల పెట్టుబడి

రిపబ్లికన్ల విజయావకా [redacted]కు ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారు. ట్రంప్‌కు మద్దతు ప్రకటించడమే కాకుండా పార్టీ అభ్యర్థుల ప్రచారానికి ఆర్థిక అండగా నిలుస్తున్నారు. ఎన్నికల వివరాల ప్రకారం అక్టోబర్ 12 నాటికి ఆయన మొత్తం రాజకీయ ఖర్చు 36.6 కోట్ల డాలర్లు (సుమారు రూ.3,472 కోట్లు) చేరింది. ఇందులో జూలై నుంచి చేసిన ఖర్చు 27.6 కోట్ల డాలర్లకు పైగా (సుమారు రూ.2,618 కోట్లు) ఉంది. రిపబ్లికన్ అభ్యర్థులకు మద్దతిచ్చే సెనేట్ లీడర్‌షిప్ ఫండ్‌కు సుమారు 15.8 కోట్ల డాలర్లు (రూ.1,499 కోట్లు) అందించారు. మస్క్‌కు చెందిన అమెరికా పీఏసీ సంస్థ ఇంటింటి ప్రచారం, డిజిటల్ ప్రకటనలు, ఓటర్లకు సమాచార చేరవేత వంటి కార్యక్రమాలు చేపడుతోంది. ముఖ్యంగా ట్రంప్ మద్దతుదారులను పోలింగ్ కేంద్రాలకు రప్పించడంపై దృష్టి పెట్టింది. కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల ఆధిపత్యం కొనసాగితే స్పేస్‌ఎక్స్ కార్యకలాపాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల విషయంలో మస్క్‌కు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు ట్రంప్ కూడా అభ్యర్థుల కోసం నిధులు సమీకరిస్తూ కీలక రాష్ట్రాల్లో ప్రచార ప్రకటనలకు భారీగా ఖర్చు చేస్తున్నారు. అయితే ధనబలం ఉన్నంత మాత్రాన ప్రజల్లోని అసంతృప్తిని తొలగించలేమని డెమొక్రాట్లు వాదిస్తున్నారు. మస్క్ పెట్టుబడులు రిపబ్లికన్లకు ప్రచార బలాన్ని ఇస్తున్నా, అవి ఓట్లుగా మారతాయా అనేది ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

ఒబామా తిరుగుప్రవేశం.. డెమొక్రాట్ల కొత్త వ్యూహం

ట్రంప్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు డెమొక్రాట్లు మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాను ఎన్నికల ప్రచారంలోకి దించారు. నల్లజాతీయులు, యువత, పట్టణ ప్రాంతాల ఓటర్లలో ఆయనకున్న ఆదరణను ఉపయోగించుకుని కీలక రాష్ట్రాల్లో అభ్యర్థులకు మద్దతు కూడగట్టడం పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. ప్రచార సభలతోపాటు ప్రకటనలు, నిధుల సేకరణ కార్యక్రమాల్లోనూ ఒబామా పాల్గొంటున్నారు. డెమొక్రాట్ల కోసం నిర్వహించిన కార్యక్రమాల ద్వారా 1.36 కోట్ల డాలర్లకు పైగా నిధులు సమీకరించినట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. ఒహాయోలో షెరాడ్ బ్రౌన్, మిషిగన్‌లో అబ్దుల్ ఎల్ సయీద్, జార్జియాలో జాన్ ఒసాఫ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ట్రంప్ విధానాలు, ఇరాన్‌తో యుద్ధం, ధరల పెరుగుదల, వలసల అంశాలపై విమర్శలు చేస్తూ, ఆయన పాలనను నియంత్రించేందుకు ఈ ఎన్నికలు కీలకమని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, నల్లజాతీయుల మద్దతు అవసరమైన ఎల్ సయీద్‌కు ఒబామా ప్రచారం ఉపయోగపడుతుందని డెమొక్రాట్లు భావిస్తున్నారు. మరోవైపు ట్రంప్ కూడా కీలక రాష్ట్రాల్లో పర్యటిస్తూ తన అభ్యర్థులకు మద్దతు కూడగడుతున్నారు. దీంతో ఎన్నికల ప్రచారంలో ఇద్దరు మాజీ, ప్రస్తుత అధ్యక్షుల ప్రభావం ప్రధాన చర్చగా మారింది. ఒబామా ప్రజాదరణను ఓట్లుగా మార్చుకుని కాంగ్రెస్‌లో పట్టు సాధించాలన్నది డెమొక్రాట్ల వ్యూహం.

డెమొక్రాట్లు గెలిస్తే.. ట్రంప్ వీటో అస్త్రం

ఎన్నికల్లో డెమొక్రాట్లు కాంగ్రెస్‌లో మెజారిటీ సాధిస్తే వారి బిల్లులను తిరస్కరించేందుకు అధ్యక్ష అధికారాన్ని ఉపయోగిస్తానని ట్రంప్ సంకేతాలిచ్చారు. తాను 'మిస్టర్ వీటో'గా మారతానంటూ వ్యాఖ్యానించారు. అయితే కొంతకాలానికి ఇరుపక్షాలు రాజీకి రావాల్సి ఉంటుందని కూడా అభిప్రాయపడ్డారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు బిల్లులను వీటో చేయవచ్చు. అయితే కాంగ్రెస్ ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజారిటీతో ఆ వీటోను అధిగమించే అవకాశం ఉంది. డెమొక్రాట్లు ప్రతినిధుల సభను గెలిస్తే ట్రంప్ ప్రభుత్వ విధానాలు, అధికారుల వ్యవహారాలు, ఖర్చులపై విచారణలు చేపట్టవచ్చు. సెనేట్‌నూ చేజిక్కించుకుంటే ఉన్నతాధికారులు, న్యాయమూర్తుల నియామకాలపై ప్రభావం చూపగలరు. అయితే కాంగ్రెస్‌లో అధికారం మారినంత మాత్రాన ట్రంప్ అధ్యక్ష పదవికి ముప్పు ఉండదు. ఆయన పదవిలో కొనసాగుతారు, కానీ కొత్త చట్టాలు, నిధుల కేటాయింపులు, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రతిపక్షం అడ్డంకులు సృష్టించవచ్చు. మరోవైపు ప్రతీకార రాజకీయాలకు బదులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని డెమొక్రాట్లలో కొందరు సూచిస్తున్నారు. ఇరుపక్షాల మధ్య రాజీ కుదరకపోతే బడ్జెట్ ఆమోదం నుంచి ప్రభుత్వ విధానాల వరకు ప్రతిష్టంభన ఏర్పడవచ్చు. డెమొక్రాట్ల విజయం ట్రంప్‌ను గద్దె దించకపోయినా, ఆయన పాలనా స్వేచ్ఛకు పరిమితులు విధించే అవకాశం ఉంది.

ఎన్నికల తీర్పు.. ట్రంప్‌కు గడ్డు కాలమేనా?

ఈ ఎన్నికల ఫలితాలు అమెరికా రాజకీయాల్లో రాబోయే రెండేళ్ల పాలనను ప్రభావితం చేయనున్నాయి. ప్రతినిధుల సభపై డెమొక్రాట్లకు ఆశలు ఎక్కువగా ఉండగా, సెనేట్‌లో మాత్రం పోటీ హోరాహోరీగా ఉంది. ట్రంప్ ఆమోద రేటింగ్ తగ్గడం, జీవన వ్యయం పెరగడం, ఇరాన్ యుద్ధంపై అసంతృప్తి రిపబ్లికన్లకు సవాలుగా మారాయి. అయితే మస్క్ ఆర్థిక మద్దతు, ట్రంప్ ప్రచార దూకుడు, సంప్రదాయ ఓటు బ్యాంకు ఆ పార్టీకి అండగా నిలవవచ్చు. మరోవైపు ఒబామా ప్రచారం డెమొక్రాట్లకు ఊపునిచ్చే అవకాశం ఉంది. ప్రతినిధుల సభ డెమొక్రాట్ల చేతికి వెళ్తే ట్రంప్ ప్రభుత్వంపై విచారణలు, రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతాయి. సెనేట్ కూడా మారితే ఆయన విధానాలకు మరింత ప్రతిఘటన ఎదురవుతుంది. రెండు సభలపై రిపబ్లికన్లు పట్టు నిలబెట్టుకుంటే ట్రంప్‌కు మరో రెండేళ్లు పాలనలో వెసులుబాటు ఉంటుంది. ఈ ఫలితాలు 2028 అధ్యక్ష ఎన్నికలపైనా ప్రభావం చూపనున్నాయి. డెమొక్రాట్లకు కొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకొచ్చే అవకాశం లభిస్తే, రిపబ్లికన్ల ఓటమి ట్రంప్ నాయకత్వంపై పార్టీలో ప్రశ్నలు రేకెత్తించవచ్చు. కాంగ్రెస్‌లో ప్రతిపక్షం బలపడినా ట్రంప్ కార్యనిర్వాహక అధికారాలతో కొన్ని విధానాలను కొనసాగించగలరు. అయితే కొత్త చట్టాలు, బడ్జెట్, సంస్కరణలకు కాంగ్రెస్ సహకారం అవసరం. అందువల్ల ఈ ఎన్నికల అసలు పరీక్ష ట్రంప్ పదవికి కాదు.. మిగిలిన రెండేళ్లు ఆయన ఎంత స్వేచ్ఛగా పాలించగలరనదే



భువీకి తలుపులు మూసుకుపోయాయా?

టీమిండియా వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ అంతర్జాతీయ భవిష్యత్తుపై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఘోరంగా విఫలమైన భువీకి ఇక భారత జట్టులో చోటు దక్కడం కష్టమేనని అభిప్రాయపడ్డాడు. నాలుగేళ్ల విరామం తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన 36 ఏళ్ల భువనేశ్వర్ నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క వికెట్ మాత్రమే పడగొట్టాడు. 2026 ఐపీఎల్‌లో 16 మ్యాచ్‌ల్లో 28 వికెట్లు తీసి అదరగొట్టిన బౌలర్, అంతర్జాతీయ క్రికెట్‌లో మాత్రం పూర్తిగా తేలిపోయాడని అశ్విన్ విశ్లేషించాడు. ఐపీఎల్‌లో కనిపించిన వేగం, రన్‌అప్‌లో ఉత్సాహం న్యూజిలాండ్ సిరీస్‌లో కనిపించలేదని, 11.50 ఎకానమీతో పరుగులు సమర్పించుకోవడం కంటే అతడి బౌలింగ్ తీవ్రత తగ్గడం ఆందోళనకరమని పేర్కొన్నాడు. అనుభవజ్ఞుడైన ఆటగాడు పునరాగమనం కోసం పూర్తి స్థాయి సన్నద్ధతతో ఉండాలని, యువ ఆటగాళ్లకు లభించే అవకాశాలు సీనియర్లకు ఉండవని స్పష్టం చేశాడు. మరోవైపు ఏడాదిన్నర కాలంగా భారత జట్టుకు దూరంగా ఉన్న మహమ్మద్ షమీకి మాత్రం అశ్విన్ మద్దతుగా నిలిచాడు. రంజీ ట్రోఫీలో బెంగాల్ తరపున షమీ చూపిస్తున్న బౌలింగ్ రిథమ్, ఫామ్ భువనేశ్వర్ కంటే మెరుగ్గా ఉన్నాయని అభిప్రాయపడ్డాడు. డిసెంబర్‌లో శ్రీలంకతో జరగనున్న మూడు టీ20ల సిరీస్‌కు ముందు సెలక్టర్ల దృష్టి ఎవరిపై పడుతుందన్నది ఆసక్తికరంగా మారింది. భువీకి మళ్లీ అవకాశం వస్తుందా? షమీ పునరాగమనం చేస్తాడా? అన్నది ఇప్పుడు భారత క్రికెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

ఐపీఎల్‌లోకి రావడం లేదు.. అమీర్ స్పష్టత!

ఐపీఎల్‌లో అడుగుపెడతాడంటూ సాగిన ప్రచారానికి పాకిస్తాన్ మాజీ స్టార్ పేసర్ మహమ్మద్ అమీర్ తెరదించాడు. బ్రిటిష్ పౌరసత్వం పొందిన ఆయన సోమవారం అఫ్గానిస్థాన్ ప్రీమియర్ లీగ్‌లో బ్రిటిష్ ఆటగాడిగా నమోదు చేసుకోవడంతో ఐపీఎల్‌లోనూ విదేశీ ఆటగాడిగా బరిలోకి దిగుతాడన్న ఊహాగానాలు మొదలయ్యాయి. గతంలో అజహర్ మహమూద్ ఇదే మార్గంలో ఐపీఎల్ ఆడటంతో ఈ చర్చకు మరింత ఊపొచ్చింది. అయితే ఈ వార్తల్లో నిజం లేదని అమీర్ ఎక్స్ వేదికగా స్పష్టం చేశాడు. ఐపీఎల్‌లో ఆడేందుకు నమోదు చేసుకుంటున్నానన్న ప్రచారం అవాస్తవమని తేల్చిచెప్పాడు. భార్య నార్జిస్ ఖాన్ ద్వారా బ్రిటిష్ పౌరసత్వం పొందిన అమీర్ ఈ ఏడాది ది హండ్రెడ్‌లో స్థానిక ఆటగాడిగా కూడా పాల్గొన్నాడు. కౌంటీ క్రికెట్, ది హండ్రెడ్ వంటి టోర్నీల్లో స్థానిక ఆటగాడిగా ఆడేందుకు మరో దేశానికి స్థానిక ఆటగాడిగా ప్రాతినిధ్యం వహించకూడదనే నిబంధనపై అంగీకరించాల్సి ఉంటుందని గతంలో వెల్లడించాడు. 36 టెస్టులు, 61 వన్డేలు, 62 టీ20లు ఆడిన అమీర్ 2024 టీ20 ప్రపంచకప్ అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. పాకిస్తాన్ ఆటగాళ్లకు ఐపీఎల్‌లో ఆడే అవకాశం లేని నేపథ్యంలో బ్రిటిష్ పౌరసత్వంతో ఆయనకు మార్గం సుగమమవుతుందన్న చర్చకు ఇప్పుడు ఆయన ప్రకటనతో తెరపడింది. అజహర్ మహమూద్ 2012 నుంచి 2015 వరకు ఐపీఎల్‌లో ఆడినప్పటికీ, అమీర్ మాత్రం ప్రస్తుతానికి ఆ లీగ్‌లోకి రావడం లేదని స్పష్టం చేశాడు.





కివీస్‌తో పోరుకు గిల్ వ్యూహం సిద్ధం!

న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సమరానికి టీమిండియా సిద్ధమైంది. నవంబర్ 4న ఆక్లాండ్ వేదికగా ప్రారంభమయ్యే తొలి పోరుకు ముందు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జట్టు బ్యాటింగ్ వ్యూహాన్ని వెల్లడించాడు. టాప్ 4లో తాను, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ బరిలోకి దిగుతారని స్పష్టం చేశాడు. తొలి మూడు వన్డేలకు గిల్ నాయకత్వం వహించనుండగా, చివరి రెండు మ్యాచ్‌లకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీ చేపట్టనున్నాడు. ఐదో, ఆరో స్థానాల్లో పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ ఆర్డర్ మార్చుతామని గిల్ తెలిపాడు. ఎడమచేతి వాటం బ్యాటర్ అవసరమైతే అక్షర్ పటేల్‌ను ముందుకు పంపుతామని, మ్యాచ్ పరిస్థితిని బట్టి కేఎల్ రాహుల్‌కు కూడా అవకాశం కల్పిస్తామని చెప్పాడు. గతంలో ఇబ్బంది పెట్టిన మెడ నొప్పి ప్రస్తుతం లేదని, దాదాపు గంటన్నర పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫీల్డింగ్ కూడా చేశానని వెల్లడించాడు. న్యూజిలాండ్ గడ్డపై గతంలో ఐదు వన్డేలు ఆడి కేవలం 124 పరుగులే చేసిన గిల్ ఈసారి మెరుగైన ప్రదర్శనపై దృష్టి పెట్టాడు. ఇందుకోసం ముందుగానే ఆక్లాండ్ చేరుకుని ప్రత్యేక నెట్ బౌలర్లతో సాధన చేశాడు. నలుగురు నుంచి ఐదుగురు నెట్ బౌలర్ల వసతి ఖర్చులను సైతం తనే భరించినట్లు సమాచారం. రాబోయే టెస్టు సిరీస్‌కు ముందు తొలి మూడు వన్డేల్లో సత్తా చాటాలని గిల్ పట్టుదలతో ఉన్నాడు. కివీస్ గడ్డపై గణాంకాలను మార్చి పరుగుల వేటలో టీమిండియాను ముందుండి నడిపిస్తాడా అన్నది ఆసక్తికరంగా మారింది.

అర్ష్‌దీప్‌కు బదులుగా మోహ్సిన్ ఖాన్!

ఐపీఎల్ ట్రేడింగ్‌లో మరో ఆసక్తికర పరిణామానికి తెరలేవనుందా? హార్దిక్ పాండ్యా కోసం అర్ష్‌దీప్ సింగ్‌ను వదులుకునేందుకు సిద్ధమవుతున్న పంజాబ్ కింగ్స్, అతడి స్థానంలో లక్నో సూపర్ జెయింట్స్ పేసర్ మోహ్సిన్ ఖాన్‌ను తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. అర్ష్‌దీప్‌తో పాటు వికెట్ కీపర్ విష్ణు వినోద్‌ను ముంబై ఇండియన్స్‌కు పంపి, హార్దిక్‌ను సొంతం చేసుకునే ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఒప్పందం ఖరారైతే ఎడమచేతి వాటం పేసర్ లోటును భర్తీ చేసేందుకు మోహ్సిన్ కోసం లక్నోను పంజాబ్ సంప్రదించవచ్చని స్పోర్ట్‌స్టార్ కథనం వెల్లడించింది. గాయాల సమస్యలు ఉన్నప్పటికీ మోహ్సిన్ బౌలింగ్ సామర్థ్యంపై పంజాబ్ యాజమాన్యం నమ్మకంతో ఉన్నట్లు తెలుస్తోంది. అతడికి బదులుగా ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినిస్‌ను లక్నోకు పంపే అవకాశముందని సమాచారం. హార్దిక్ రాకతో పంజాబ్ జట్టులో స్టోయినిస్ పాత్ర తగ్గవచ్చన్నది ఈ ప్రతిపాదన వెనుక కారణంగా చెబుతున్నారు. గతంలో లక్నో తరపున 2022 నుంచి 2024 వరకు ఆడిన స్టోయినిస్‌ను 2025 వేలంలో పంజాబ్ రూ.11 కోట్లకు కొనుగోలు చేసింది. మరోవైపు అర్ష్‌దీప్‌ను కూడా 2025 వేలంలో పంజాబ్ రూ.18 కోట్లకు ఆర్టీఎం ద్వారా తిరిగి దక్కించుకుంది. నవంబర్ 17 రిటెన్షన్ గడువు సమీపిస్తున్న వేళ ఈ ట్రేడింగ్ వార్తలు ఐపీఎల్ వర్గాల్లో ఆసక్తి పెంచుతున్నాయి. అయితే హార్దిక్, అర్ష్‌దీప్, మోహ్సిన్, స్టోయినిస్‌ల మార్పిడిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇప్పటికే రిషభ్ పంత్‌కు బదులుగా కుల్దీప్ యాదవ్‌ను ఢిల్లీ నుంచి తీసుకున్న లక్నో, ఇప్పుడు మరో కీలక ట్రేడ్‌కు సిద్ధమవుతుందా అన్నది చూడాలి.



ఐపీఎల్ 2027.. రిటెన్షన్ గడువు పొడిగింపు!

ఐపీఎల్ 2027 మినీ వేలానికి రంగం సిద్ధమవుతోంది. ఆటగాళ్ల రిటెన్షన్, విడుదల జాబితాలను ఖరారు చేసేందుకు ఫ్రాంచైజీలకు మరో రెండు రోజుల గడువు పెంచుతూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. తొలుత నవంబర్ 15గా నిర్ణయించిన చివరి తేదీని నవంబర్ 17కు మార్చింది. డిసెంబర్ 16న గోవాలో జరగనున్న మినీ వేలానికి ముందు జట్ల వ్యూహాలకు ఈ అదనపు సమయం కీలకం కానుంది. నవంబర్ 23తో ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ ముగియనుండగా, అదనపు ఆటగాళ్ల పేర్లను చేర్చేందుకు నవంబర్ 27 వరకు జట్లకు అవకాశం ఉంటుంది. డిసెంబర్ 3న తుది ఆటగాళ్ల జాబితా, వేలం క్రమాన్ని ఫ్రాంచైజీలకు అందించనున్నారు. ఇప్పటికే ట్రేడింగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్‌ను లక్నో నుంచి తిరిగి సొంతం చేసుకోగా, కుల్దీప్ యాదవ్ లక్నోకు వెళ్లాడు. మరో ఒప్పందంలో టీ. నటరాజన్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చేరగా, జీషాన్ అన్సారీ ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి వచ్చాడు. ప్రస్తుత ఐపీఎల్ చక్రంలో ఇదే చివరి మినీ వేలం కావడంతో జట్లు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. 2028 సీజన్‌కు ముందు మెగా వేలం జరగనుండటంతో ఇప్పటి నిర్ణయాలు భవిష్యత్ జట్ల రూపురేఖలను ప్రభావితం చేయనున్నాయి. ఆటగాళ్ల నిలుపుదల నుంచి భారీ కొనుగోళ్ల వరకు ఐపీఎల్ వేలం మరోసారి క్రికెట్ ప్రపంచంలో ఉత్కంఠ రేపేందుకు సిద్ధమవుతోంది.





రామాయణం ఎవర్‌గ్రీన్

ఎపిక్ స్టోరీకి రెడీ అవుతున్న సిల్వర్ స్క్రీన్

- బుల్లితెర నుంచి బిగ్‌స్క్రీన్ వరకు
- భక్తి, వివాదాలు, హైప్‌తో భారీ పెరిగిన అంచనాలు
- ప్రపంచ వ్యాప్తంగా రేపే రామాయణం విడుదల
- ఆధ్యాత్మికం.. ఆర్థికం.. వెరసి ₹4 వేల కోట్ల బడ్జెట్

రామాయణం.. తరతరాలుగా భారతీయుల మనసుల్లో చెరగని ముద్ర వేసిన ఇతిహాసం. బుల్లితెరపై రామానంద సాగర్ సృష్టించిన అద్భుతం నుంచి నేటి అత్యాధునిక వెండితెర ఆవిష్కరణ వరకు ఎన్నో రూపాల్లో ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. ఇప్పుడు నితేశ్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యష్ రావణుడిగా నటించిన భారీ చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. సుమారు రూ.4,000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతికత, ఐమ్యాక్స్ 3డీ హంగులు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అయితే విడుదలకు ముందే నటీనటుల ఎంపిక, ఏఆర్ రెహమాన్ సంగీతం, విజువల్ ఎఫెక్ట్స్, పాత్రల రూపకల్పనపై తీవ్ర చర్చలు, వివాదాలు మొదలయ్యాయి. రణ్‌బీర్ పాత వ్యాఖ్యలు, సాయిపల్లవి ఎంపికపై అభ్యంతరాలు, రావణుడి పాత్రపై వ్యాఖ్యలు కూడా సోషల్ మీడియాలో దుమారం రేపాయి. మరోవైపు బుక్‌మైషోలో ఐదు లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం రావడంతో బాక్సాఫీస్ అంచనాలు పెరిగాయి. గతంలో రామాయణం ఆధారంగా వచ్చిన సినిమాలు, టెలివిజన్ ధారావాహికల్లో కొన్ని అపూర్వ ఆదరణ పొందగా, మరికొన్ని విమర్శలు ఎదుర్కొన్నాయి. అయినప్పటికీ ఈ ఇతిహాసంపై ప్రేక్షకుల ఆసక్తి తగ్గలేదు. అసలు రామాయణానికి తరతరాలుగా ఇంతటి ఆదరణ వెనుక కారణమేమిటి? పాత విజయాల స్ఫూర్తితో వస్తున్న ఈ భారీ చిత్రం ప్రేక్షకుల విశ్వాసాన్ని, ఆధునిక సినిమా అంచనాలను ఏ మేరకు అందుకుంటుంది? వివాదాలు ప్రచారానికి బలమవుతాయా? భారీ పెట్టుబడికి తగ్గ వసూళ్లు సాధిస్తుందా? భక్తి, సాంకేతికత, వ్యాపార అంచనాలు కలిసిన ఈ రామాయణ మహాప్రయాణంలో ప్రేక్షకుల తీర్పే అసలైన క్లైమాక్స్ కానుంది.

బుల్లితెరపై మొదలైన ప్రభంజనం!

1987లో రామానంద సాగర్ దర్శకత్వంలో దూరదర్శన్‌లో ప్రసారమైన 'రామాయణం' భారతీయ టెలివిజన్ చరిత్రనే మార్చేసింది. మొత్తం 78 ఎపిసోడ్లుగా ప్రసారమైన ఈ ధారావాహిక ఆదివారం ఉదయం 9.30 గంటలకు దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాలను టీవీల ముందు కూర్చోబెట్టింది. అప్పట్లో రాముడిగా అరుణ్ గోవిల్, సీతగా దీపికా చిక్లియా, లక్ష్మణుడిగా సునీల్ లహ్రీ, హనుమంతుడిగా దారా సింగ్ నటించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. రామాయణం ప్రసారమయ్యే సమయంలో వీధులు నిర్మానుష్యంగా మారేవని, టీవీ ఉన్న ఇళ్ల వద్ద ప్రజలు గుమిగూడేవారని చెప్పుకునే స్థాయిలో ఆ సీరియల్ ప్రభావం ఉండేది. నటీనటులను నిజంగానే రాముడు, సీతగా భావించి అభిమానులు పూజించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ విజయంతో రామాయణం కేవలం వినోద కార్యక్రమం కాకుండా సామాజిక, సాంస్కృతిక అనుభూతిగా మారింది. 1993లో భారత్, జపాన్ సంయుక్త నిర్మాణంలో రూపొందిన 'రామాయణ: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామా' యానిమేషన్ చిత్రం మరో ప్రత్యేక ప్రయోగంగా నిలిచింది. 2022లో 4కే నాణ్యతతో మళ్లీ థియేటర్లలో విడుదలై కొత్త తరం ప్రేక్షకులను ఆకట్టుకుంది. 2008లో గుర్మీత్ చౌదరి, డెబీనా బెనర్జీ ప్రధాన పాత్రల్లో నటించిన రామాయణం సుమారు 300 ఎపిసోడ్ల పాటు ప్రేక్షకులను అలరించింది. 2012లో 'రామాయణ్ - జీవన్ కా ఆధార్' పేరుతో మరో రూపంలో వచ్చింది. 2015లో స్టార్ ప్లస్‌లో ప్రసారమైన 'సియా కే రామ్' సీత దృష్టికోణంలో కథను చూపించి కొత్త ఆలోచనకు తెరతీసింది. ఇలా ప్రతి తరం తన కాలానికి తగిన రూపంలో రామాయణాన్ని స్వీకరించింది. వెండితెరపై కూడా ఈ ఇతిహాసం ఎన్నో రూపాల్లో ఆవిష్కృతమైంది. అయితే గత చిత్రాలన్నీ ఒకే స్థాయిలో విజయాలు సాధించాయని చెప్పలేం. ఆదరణ పొందిన చిత్రాలు ఉన్నాయి, విమర్శలు ఎదుర్కొన్న ప్రయోగాలు ఉన్నాయి. ముఖ్యంగా 2023లో వచ్చిన 'ఆదిపురుష్' చిత్రంపై పాత్రల రూపకల్పన, సంభాషణలు, దృశ్యాల విషయంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఆ అనుభవం కొత్త రామాయణం రూపకర్తలకు పెద్ద సవాలుగా మారింది. కథ తెలిసినదే అయినా దాన్ని ఎంత కొత్తగా, ఎంత గౌరవప్రదంగా, ఎంత ప్రభావవంతంగా చూపించగలమన్నదే అసలైన పరీక్ష.

సినిమా చుట్టూ వివాదాల రిసౌండ్!

నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న రామాయణం విడుదలకు ముందే పలు వివాదాలతో వార్తల్లో నిలిచింది. ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన 'మంగళ్ రంగ్', 'రావణ తాండవ్' పాటల్లో సూఫీ సంగీత ఛాయలు, ఎలక్ట్రానిక్ ప్రయోగాలు ఉన్నాయంటూ కొందరు విమర్శించారు. సంగీతాన్ని రూపొందించడానికి నెలల సమయం పడుతుందని, అందరినీ సంతృప్తిపరచడం సాధ్యం కాదని రెహమాన్ స్పందించారు. తొలి టీజర్‌లో విజువల్ ఎఫెక్ట్స్ నాణ్యతపై, ఏఐ వినియోగంపై కూడా విమర్శలు వచ్చాయి. దీనిపై యష్ స్పందిస్తూ చిన్నచిన్న లోపాల కోసం వెతకకుండా సినిమాను ఓపెన్ మైండ్‌తో చూడాలని కోరారు. సీత పాత్రలో సాయిపల్లవి ఎంపిక, ఆమె రూపం, హిందీ ఉచ్చారణ, దుస్తుల రూపకల్పనపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. గతంలో ఆమె చేసిన వ్యాఖ్యలను తిరిగి తెరపైకి తెచ్చి బహిష్కరణ పిలుపులు ఇచ్చారు. రాముడిగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్ 2011లో తనకు బీఫ్ ఇష్టమని చెప్పిన పాత ఇంటర్వ్యూ కూడా వివాదానికి కారణమైంది. సినిమా కోసం సాత్విక జీవనశైలి పాటిస్తున్నారన్న ప్రచారంతో పాటు కుటుంబ విందు వీడియోలు బయటకు రావడంతో విమర్శలు పెరిగాయి. సీత పాత్రకు కరీనా కపూర్ ఖాన్ రెట్టింపు పారితోషికం అడిగారన్న వార్తలను ఆమె ఖండిస్తూ, తనను ఆ పాత్రకు సంప్రదించలేదని స్పష్టం చేశారు. మరోవైపు, రామానంద సాగర్ రామాయణంలో సీతగా నటించిన దీపికా చిక్లియా తొలుత మరో రామాయణం నిర్మాణంపై అసంతృప్తి వ్యక్తం చేసినా, కొత్త సినిమా టీజర్‌ను ప్రశంసించారు.

రామాయణం.. బాక్సాఫీస్‌పై భారీ అంచనాలు

రావణుడి పాత్రపై క్యాస్టింగ్ డైరెక్టర్ ముఖేష్ ఛబ్రా చేసిన వ్యాఖ్యలు మరో వివాదానికి దారితీశాయి. రావణుడి ప్రతీకారం వెనుక సోదరిపై ప్రేమ ఉందన్న ఆయన వ్యాఖ్యలను పలువురు తప్పుబట్టడంతో, తర్వాత క్షమాపణలు చెబుతూ వెనక్కి తీసుకున్నారు. స్క్రిప్ట్ హక్కుల విషయంలో నిర్మాణ సంస్థల మధ్య వివాదం తలెత్తగా, చిత్ర దృశ్యాలు అనధికారికంగా లీక్ కాకుండా బాంబే హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. రామాయణాన్ని ముందుగా హిందూ సంస్థలు, రామలీలా సంఘాలకు ప్రత్యేకంగా ప్రదర్శించాలని డిమాండ్లు వచ్చాయి. రణ్‌బీర్ ఎంపికను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త నిరసనల హెచ్చరికలు కూడా వెలువడ్డాయి. ఇన్ని వివాదాల మధ్య నవంబర్ 5న విడుదలకు సిద్ధమైన ఈ సినిమాకు ముందస్తు బుకింగ్స్‌లో మంచి స్పందన లభిస్తోంది. బుక్‌మైషోలో ఐదు లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల్లోనూ అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఐమ్యాక్స్ 3డీ ప్రదర్శనలతో అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకోవాలని నిర్మాతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. వివాదాలు సినిమాకు ప్రచారంగా మారతాయా? భారీ బడ్జెట్‌కు తగ్గ వసూళ్లు వస్తాయా? ప్రేక్షకుల మనసుల్లో ఇప్పటికే స్థిరపడిన రామాయణాన్ని కొత్త సాంకేతికతతో ఎంతవరకు మెప్పించగలుగుతారు? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.